మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజిలు - 8
సంచిక : 95 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

బుధవారం 03 జులై 2024

# ప్రజలకు జవాబుదారీగా ఉండాలి



- తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- వారానికో రోజు క్షేత్ర స్థాయి పర్యటన
- నెలకోసారి జిల్లా అధికారులతో సమీక్ష
- ఐఏఎస్ అధికారులకు సీఎం దిశానిర్దేశం
- త్వరలోనే సీఎం జిల్లాల పర్యటనలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని విభాగాల ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఐఏఎస్ అధికారులందరూ విధిగా తమ పరిధిలోని శాఖలు, విభాగాలపై పట్టు సాధించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజా పాలనను అందించేందుకు అందరూ బాధ్యతగా పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. అందరూ కలిసికట్టుగా పని చేసి ప్రజలకు సుపరిపాలనను అందించి తీరాలని చెప్పారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని అన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రక్షాళన చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు పలువురు ముఖ్యమంత్రులతో పని చేసిన అనుభవమున్న అధికారులు ఇప్పటికీ కీలక విభాగాల్లో ఉన్నారని, ఎప్పటికప్పుడు ఆ ప్రభుత్వ ప్రాధాన్యాతలను గుర్తించి అధికారులు తమ పనితీరును చాటుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు మేలు జరిగే పనులు చేయాలనే సంకల్పంతో విధులు నిర్వహించాలని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని కోరారు. సచివాలయంలో మంగళవారం అన్ని విభాగాల కార్యదర్శులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సమావేమయ్యారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి ఈ సమీక్షలో పాల్గొన్నారు. మొత్తం 29 విభాగాలకు చెందిన ఐఏఎస్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అధికారులందరూ ఏకతాటిపై పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. సచివాలయం నుంచి క్షేత్రస్థాయి వరకు అందరూ తమ విభాగాలపై పట్టు సాధించాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల్లో అయిదు గ్యారంటీలను అమలు చేసిందని సీఎం చెప్పారు. తర్వాత మిగతా 2లో..



# మాట్లాడుకుందామా!

## ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సీఎంల కీలక భేటి

- విభజన సమస్యల పరిష్కార వేదికగా హైదరాబాద్
- జూలై6న ముఖాముఖి చర్చలకు అంగీకారం
- ఎజెండాపై కసరత్తు చేస్తున్న ఇరు రాష్ట్రాల అధికారులు
- పలు అంశాలపై సీఎంల మధ్య సాగనున్న చర్చలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
విబజన సమస్యలపై దాదాపు పదేళ్ల తరవాత ఇప్పుడు అడుగు పడబోతోంది. ఉమ్మడి ఎపిలో సిఎంగా ఉన్న చంద్రబాబు ఇప్పుడు అడుగు వేశారు. తెలంగాణతో కలసి చర్చించాలన్న నిర్ణయానికి వచ్చారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న కెసిఆర్ ఈ విషయంలో ఎక్కడ ఆచొరవ చూపలేదు. దీంతో అనేకానేక సమస్యలు అలాగే ఉండిపోయాయి. వాటిని పరిష్కరించుకోవడం ద్వారా ప్రజల్లో భరోసా కల్పించాల్సి ఉంది. ప్రజలుగా అంతా ఒక్కటిగానే ఉన్నారు. ప్రాంతాలు విడిపోయి నా విభేదాలు రాకూడదు. ఇప్పుడు ఇదే ప్రయత్నం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయాక విభజన మిగతా 2లో..

## విలీనమైన ఏడు మండలాలే తొలి ఎజెండా కావాలి

- ఆ తరవాతే మిగిలిన అంశాలు చర్చించాలి - హరీశ్‌రావు డిమాండ్
- చర్చలను స్వాగతించిన కోదండరామ్



హైదరాబాద్, (ప్రజా మంటలు):
ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించడానికి లేఖ రాయడం సంతోషకర పరిణామమని ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టును ఏపీలో కలిపారన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఏడు మండలాలను ఏపీకి అప్పగించారన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి చొరవ చూపాలని చంద్రబాబు అన్నారు. ఏడు మండలాలను తిరిగి తెలంగాణకు మిగతా 2లో..

# ఆధ్యాత్మిక కార్యక్రమంలో తొక్కిసలాట

- ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాథ్రస్‌లో ఘోర విషాదం
- దాదాపు 87మంది మృతి
- సమీప ఆస్పత్రులకు క్షతగ్రాత్రుల తరలింపు
- సత్సంగ్ కార్యక్రమంలో ఘటన
- ప్రధాని మోడీ, సీఎం యోగి దిగ్భ్రాంతి
- సంఘటనా స్థలంలో ముమ్మరంగా సహాయక చర్యలు



లక్నో (ప్రజా మంటలు):
ఉత్తర్‌ప్రదేశ్ లోని హాథ్రస్ లో పెను విషాదం చోటుచేసుకుంది. ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భారీ తొక్కిసలాటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు 87 మంది ప్రాణాలు కోల్పోయారు. రతిభాన్‌పుర్‌లో శివారాధన కార్యక్రమ సమయంలో తొక్కిసలాట జరగడంతో ఈ దుర్ఘటన సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. వారిలో మహిళలు చిన్నారులు ఉన్నారు. వెంటనే వారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. ఘటనపై ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ దుర్ఘటనపై హాథ్రస్ జిల్లా మెజిస్ట్రేట్ ఆశీష్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లా అధికార యంత్రాంగం ఈ ఘటనపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేస్తోంది. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నాం. 50-60 మంది వరకు మిగతా 2లో..


# ముఖ్యమంత్రి సహాయనిధికి ఇక ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

- మరింత పారదర్శకత కోసం సీఎం రేవంత్ నిర్ణయం



హైదరాబాద్, (ప్రజా మంటలు):
ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) దరఖాస్తులను ఇక నుంచి ఆన్ లైన్ లో స్వీకరించనున్నారు. సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్ సైట్ ను రూపొందించారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వెబ్ సైట్ ను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పెట్టిన నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక ముందు ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులను ఈ వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫార్సు లేఖ ను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్ లో సంబంధింత దరఖాస్తు దారుల బ్యాంక్ అకౌంట్ నెంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్ఎఫ్ కు సంబంధించిన ఒక కోడ్ ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్ లైన్ ద్వారా అప్లికేషన్ ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్ ఎఫ్ అప్లికేషన్ ను ఆమోదించి చెక్ ను సిద్ధం చేస్తారు. చెక్ పైన తప్పని సరిగా దరఖాస్తుదారుడి అకౌంట్ నెంబర్ ను ముద్రిస్తారు. దీని వల్ల చెక్ పక్కదారి పట్టే అవకాశం ఉండదు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్ లను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు. ఈ నెల 15 తర్వాత సీఎంఆర్ఎఫ్ ధరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు. సంబంధత వెబ్‌సైట్ లో దరఖాస్తు అందుబాటులో ఉంటుంది.

## ప్రజా నాడి




# పదేళ్లలో దేశం అన్నిరంగాల్లో దూసుకుపోతోంది

- శత్రుదుర్భేద్యంగా రక్షణరంగం
- కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశాం
- వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం
- కాంగ్రెస్ పాలన అంతా కుంభకోణాలు,అవినీతిమయం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో ప్రధానిమోడీ
- మోడీ ప్రసంగిస్తుండగా మణిపూర్ అంటూ నినాదాల హోరు



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):
కాంగ్రెస్ పాలనలో కుంభకోణాలు, అవినీతి చర్యలు, దేశం పట్ల నిర్లక్ష్యం కారణంగా దేశం దివాళ తీసిందితప్ప మరోటి కానరాదని ప్రధాని మోడీ తూర్పారా బట్టారు. దేశంలో గతమంతా మిధ్య అని, ఈ పదేళ్లలోనే దేశం అన్ని రంగాల్లో దూసుకుని పోతోందని అన్నారు. దేశంలో కొన్ని దశాబ్దాల పాటు బుజ్జగింపు రాజకీయాలు కొనసాగాయి. దాంతో దేశం తీవ్రంగా నష్టపోయింది. 2014లో దేశం నిరాశ, నిస్పృహలో కూరుకుపోయింది. ప్రజలంతా ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయారు. ఆ సమయంలో ప్రతి సామాన్యుడి నోట ఒకటే మాట వినబడేది.. 'ఈ దేశంలో మార్పు రాదా?' అని..! అప్పుడు ఏ పేపర్ చూసినా కుంభకోణాల వార్తలే కన్పించేవి. గత ప్రభుత్వాల పాలనలో రూపాయిలో యాభై పైసలు అవినీతి జరిగేది. గతంలో గ్యాస్ కనెక్షన్ల కోసం ఎంపీల చుట్టూ తిరగాల్సిన పని ఉండేది. రేషన్ బియ్యం దొరకడం కష్టంగా ఉండేది. వీటన్నిటితో ప్రజలు విసుగెత్తిపోయారు. మమ్మల్ని ఎన్నుకున్న తర్వాతే మార్పు మొదలైంది. ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని ప్రధాని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశ ప్రజలంతా పరిపక్వతతో తీర్పునిచ్చారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. వరుసగా మూడోసారి తాము అధికారంలోకి రావడంతో కొందరు తీవ్ర మనస్తాపానికి గురయ్యారని కాంగ్రెస్‌కు పరోక్షంగా చురకలంటిం చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా ప్రధాని మోదీ మంగళవారం లోక్‌సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా విపక్షాలపై విరుచుకుపడ్డారు. అయితే మోడీ ప్రసంగిస్తున్నంత సేపు విపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ ఆటంకపరిచే యత్నాలు కొనసాగించారు. ప్రధాని మోదీ ప్రసంగిస్తుండగా విపక్షాలు ఆందోళనకు దిగాయి. నీట్ పేపర్ లీకేజ్, మణిపుర్ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేస్తూ గట్టిగట్టిగా నినాదాలు చేశాయి. దీంతో స్పీకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవడం సబబు కాదన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. సభను తప్పుదోవ పట్టించొద్దని అన్నారు. అయినప్పటికీ వారు వినిపించుకోలేదు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు 'మణిపుర్.. మణిపుర్' అంటూ నినాదాలు చేశారు. వారి నిరసన మధ్యే ప్రధాని ప్రసంగాన్ని కొనసాగించారు. అయినా మోడీ వారి నిరసనలు లెక్క చేయకుండా తాను చెప్పదల్చుకున్నది చెప్పారు. ఈ క్రమంలో విపక్ష నేత రాహుల్, అఖిలేశ్ యాదవ్‌లు చిద్విలాసంగా కనిపించారు. ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఎన్ని అబద్దాలు చెప్పినా లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాలకు మళ్లీ ఘోర ఓటమి తప్పలేదని.. వారి బాధను అర్థం చేసుకోగలనని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలోనే కూర్చోవాలని ప్రజలు మరోసారి తీర్పునిచ్చారు. వరుసగా మూడుసార్లు ఆ పార్టీ 100 మార్క్ దాటలేదు. ఇన్నిసార్లు ఓడినా వారిలో ఎలాంటి మార్పు రాలేదు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో ప్రతిపక్ష నేతలకు అర్థం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

## ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

వంద రోజులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయని, ఇకపై అధికారులు విధిగా పరిపాలనపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని అన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైతే అధికారులు, సిబ్బంది ప్రక్షాళన చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలను ఎప్పటికప్పుడు నేరుగా సీఎంవోతో పంచుకోవాలని సూచించారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు అధికారులు క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి ప్రజా ప్రయోజనాలకు ప్రాదాన్యమివ్వాలని సీఎం చెప్పారు. వేళాపాళలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి రోజు టైమ్ ప్రకారం సెక్రేటేరియట్లో అందుబాటులో ఉండాలని కోరారు. కేవలం ఆఫీసులకు పరిమితం కాకుండా తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికి ఒక రోజు విధిగా జిల్లాలకు క్షేత్ర పర్యటనకు వెళ్లాలని ఆదేశించారు. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, సంబంధిత విభాగం చేపట్టిన కార్యక్రమాలు, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. చాలా జిల్లాల్లో కలెక్టర్లు ఆఫీసులు దాటడం లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐఏఎస్ అధికారులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, తమ అనుభవంతో సుపరిపాలన విధానాలు అమలు చేయాలని సూచించారు. విధిగా కలెక్టర్లు కూడా క్షేత్ర పర్యటనకు వెళ్లేలా చూడాలని ముఖ్యమంత్రి సీఎస్ను ఆదేశించారు. ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను అప్పుడప్పుడు విజిట్ చేయాలని చెప్పారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు, అనూహ్యంగా జరిగే సంఘటనలు, దుర్ఘటనలన్నింటా అధికారులు సత్వరమే స్పందించాలని కోరారు. అన్ని శాఖల్లో మెరుగైన విధానాలు అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని సీఎం గుర్తు చేశారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. వ్యక్తిగతంగా అధికారులపై రాగద్వేషాలేమీ లేవని, కేవలం పని తీరు ఆధారంగానే అధికారులకు తదుపరి ఉన్నత అవకాశాలుంటాయని, బాగా పని చేసే వారికి ప్రోత్సాహకాలుంటాయని సీఎం అధికారులకు భరోసా ఇచ్చారు. లేనిపోని సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని, ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని చెప్పారు. త్వరలోనే వారానికో జిల్లా పర్యటనకు వెళుతానని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి ఈ సమావేశంలో వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. అక్కడి ప్రజలను కలుసుకునేలా తన పర్యటన ఉంటుందని అధికారులను అప్రమత్తం చేశారు. త్వరలోనే తన జిల్లా పర్యటనల షెడ్యూలు విడుదల చేస్తామని చెప్పారు.

## పదేళ్లలో దేశం అన్నిరంగాల్లో దూసుకుపోతోంది



కావట్లేదు. 99 సీట్లు వచ్చాయని కాంగ్రెస్ నేతలు మిఠాయిలు పంచుకుంటున్నారు. కాంగ్రెస్కు వందకు 99 సీట్లు రాలేదు. 543లో 99 వచ్చాయి. వారి స్ట్రయిక్ రేట్ 26శాతం మాత్రమే. ప్రజా తీర్పును వారు ఇకనైనా గౌరవించాలని మోదీ హితవు పలికారు. వికసిత్ భారత్ లక్ష్యంగా రాష్ట్రపతి మార్గదర్శనం చేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై పలువురు సభ్యులు అభిప్రాయాలు చెప్పారు. సభ గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత మనదే. పదేళ్లలో అవినీతిరహిత పాలన అందించాం. అది చూసే ప్రజలు మరోసారి మాకు అవకాశమిచ్చారు. గత పదేళ్లలో ప్రపంచ దేశాల్లో దేశ ప్రతిష్ఠ మరింత పెరిగింది. ఇవాళ ప్రపంచమంతా మనవైపు చూస్తోంది. భారత్ ప్రథమ్ అనే మా విధానాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాం. ఏ కార్యక్రమం చేపట్టినా భారత్ ప్రథమ్ కేంద్రంగానే తీసుకుంటున్నాం. మా పథకాలన్నీ అట్టడుగు వర్గాలకు చేరాలనేదే మా విధానం అని ప్రధాని తెలిపారు. 2014కు ముందు దేశంలోకి ఉగ్రవాదులు చొరబడి దేశంలో ఎక్కడపడితే అక్కడ దాడులు చేసేవారు. మేం వచ్చాకే ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాం. సర్జికల్ స్ట్రైక్స్ చేశాం. రాజ్యాంగాన్ని తలపై పెట్టుకుని చిందులేస్తున్న వారు.. జమ్ముకశ్మీర్లో దాన్ని అమలు చేయలేక.. అంబేద్కర్ను అవమానించారు. జమ్ముకశ్మీర్లో ఆర్టికల్ 370ని తొలగించాకే అక్కడ శాంతిభద్రతలు మెరుగయ్యాయి. అక్కడ రాళ్ల దాడులు తగ్గాయి. గతంలో దోషులు చట్టం నుంచి తప్పించుకునేవారు. 2014 తర్వాత దోషుల ఇళ్ల వద్ద కూడా బుల్లెట్ల వర్షం కురిసింది. మేం వచ్చాకే తుప్పుపట్టిన చట్టాలను రద్దు చేశామని మోదీ గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. లోక్సభ ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో మా కూటమి క్లీన్ స్వీప్ చేసింది. ఒడిశాలో జగన్నాథుడి ఆశీస్సులతో ప్రభుత్వం ఏర్పాటు చేశాం. అనేక రాష్ట్రాలు భాజపా పాలనను కోరుకుంటున్నాయని మోదీ తెలిపారు. ఇకపోతే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా తనదైన శైలిలో ఘాటు విమర్శలు చేశారు. రాహుల్ గాంధీ సోమవారం లోక్ సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై మోదీ తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీ చేసిన ఆ వ్యాఖ్యలు దేశ ప్రజలు చాలా ఏళ్ల వరకూ మర్చిపోబోరని.. హిందువులది హింసాత్మక వైఖరి అని రాహుల్ మాట్లాడడం ద్వారా ఆయన సానుభూతి పొందాలని చూస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలపై దేశ ప్రజలు కూడా ఆలోచన చేయాలని మోదీ పిలుపు ఇచ్చారు. హిందువులు ఎంత సంయమనస్కులో ప్రపంచానికి తెలుసన్నారు. ఆనాడు చికాగో సదస్సులో స్వామి వివేకానంద చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సభలో చిన్నపిల్లల చేష్టలు చూస్తున్నాం. రాహుల్ గాంధీ పిల్ల చేష్టలు చాలాసార్లు బయటపడ్డాయి. ఆయన కన్నుకొడతారు.. ఆలింగనం చేసుకుంటారు. సానుభూతి పొందేందుకు ఆడిన పిల్లాడి డ్రామాలు అందరూ చూశారు. రాహుల్ చెప్పేవి అన్నీ అబద్ధాలు అని తేలిపోయాయి. సభా మర్యాదలను కూడా తగ్గించేలా వారు వ్యవహరించడం చూస్తున్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్లుగా నిన్న బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడ్డాయేమో అని అందరూ చూసుకున్నారు. ఆ పార్టీ చెప్పే అబద్ధాలు కాంగ్రెస్ కు మరింత నష్టం కలిగిస్తాయని అన్నారు. దళిత, ఓబీసీ వ్యతిరేక వైఖరి వల్లే అంబేద్కర్, నెహ్రూ కేబినెట్ నుంచి వైదొలిగారు. హిందువులది హింసాత్మక వైఖరి అంటారా? ఇదేనా మీ సంస్కారం. హిందువులపై రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలు ఎన్నో ఏళ్ల వరకు మర్చిపోరు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంస్కారం ఇదేనా? ఆయన మాటలు క్షమించరానివి. హిందువులపై నిందలు వేయడం ఫ్యాషన్ అయిపోయింది. దీన్ని సహించేది లేదు. హిందువులు అప్రమత్తంగా ఉండాలి. ఈశ్వరుడి రూపం దర్శనం కోసం.. సభలో ప్రదర్శన కోసం కాదు. ఇండి కూటమి నేతలు హిందూ ఉగ్రవాదం అంటూ ప్రచారం చేస్తున్నారు' అని మోదీ మాట్లాడారు. రాష్ట్రపతి ప్రసంగంలో వికసిత్ భారత్ లక్ష్యాల గురించి మోడీ వివరించారు. పదేళ్లలో 25 కోట్ల మంది పేదలు పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు. పదేళ్లలో భారత్ ఖ్యాతి ఎంతో పెరిగిందని మోడీ అన్నారు. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. అవినీతి ఏ మాత్రం సహించకుండా పరిపాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. వికసిత్ భారత్ కోసం ప్రజల ఆశీర్వాదం కోరామని, దేశ ప్రజలు మాపై భరోసా ఉంచారన్నారు. రోణ రంగాన్ని ఆధునీకరిస్తున్నామని అన్నారు. అలాగే అన్నిరంగాల్లో పురోగతిని సాధిస్తున్నామని అన్నారు. అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి లోక్సభ ఆమోదం తెలిపింది.

## మాట్లాడుకుందామా

సమస్యలను పరిష్కరించుకోవడంలో గత పాలకులు విఫలమయ్యారు. తెలుగు రాష్ట్రాల ప్రయోజనం కోసం విభజన సమస్యల పరిష్కారం దిశగా సమావేశం ఏర్పాటు చేయాలని చంద్రబాబు ప్రతిపాదించారు. తద్వారా విభజన సమస్యలపై చర్చించు కుందామని.. పొరుగు రాష్ట్రాలుగా పరస్పర సహకారాలు అందించుకుందామని చంద్రబాబు తెలిపారు. 'తనదైన ముద్ర వేస్తూ పరిపాలన సాగిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇందుకు సిద్ధంగానే ఉన్నారు. ఆయన కూడా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్న సన్నద్ధతను గతంలోనే చాటారు. ఇందుకోసం కసరత్తు కూడా మొదలు పెట్టారు. అధికారులు, మంత్రులతో చర్చించి ఎజెండా కరారు చేసే పనిలో ఉన్నారు. ఇలా చేయడం తెలంగాణ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడతాయి. మనం రెండు రాష్ట్రాల సమగ్ర, సుస్థిర అభివృద్ధి కోసం పరస్పరం సహకారం అందించు కోవాలని చంద్రబాబు కూడా సంకల్పం ప్రకటించారు. ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి 10 ఏళ్లు గడిచాయి. పునర్విభజన చట్టం ప్రకారం ఇంకా ఎన్నో సమస్యలు పరిష్కారం కావాల్సి ఉండగా అవన్నీ ఇంకా పెండింగ్లోనే ఉండిపోయాయి. వాటి కారణంగా మన రెండు రాష్ట్రాల సంక్షేమం, ఇతర అంశాలకు అడ్డంకిగా మారుతోంది. వీటన్నింటిని మనం కూర్చొని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసం జూలై 6న శనివారం మధ్యాహ్నం మీ ప్రాంతంలో సమావేశం ఏర్పాటు చేసుకొందామని నేను ప్రతిపాదిస్తున్నాను. రెండు రాష్ట్రాల మధ్య ఉన్న కీలకమైన సమస్యలు ఇలా ముఖాముఖి సమావేశంలో కూర్చొని చర్చించుకుంటేనే పరిష్కారం అవుతాయి. ఇరు రాష్ట్రాలకు లబ్ధికలిగే విధంగా పరస్పరం సహకరించుకోవాలి. మన భేటీ సత్ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నానుఅని చంద్రబాబు లేఖలో రాశారు.ఈ నెల 6న భేటీ కానున్నట్లు లేఖలో ప్రతిపాదించారు. పరస్పర సహకార అభివృద్ధికి మా భాగస్వామ్య నిబద్ధత వృద్ధి, శ్రేయస్సుకు మా పరస్పర లక్ష్యాలను సాధించడంలో కీలకమైనదన్నారు. పునర్వ్యవస్థీకరణ చట్టం నుండి ఉత్పన్నమయ్యే సమస్యల గురించి అనేక చర్చలు జరిగాయి. దీంతో శనివారం మధ్యాహ్నం తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కానున్నారు. ఇందుకు ఇరు రాష్ట్రాల్లో కార్యాచరణ సాగుతోంది.

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: విభజన సమస్యల పరిష్కారం కోసం భేటీ అవుదామంటూ ఏపీ సీఎం చంద్రబాబు రాసిన లేఖపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. చర్చల ప్రతిపాదనను ఆహ్వానిస్తూ ఈమేరకు చంద్రబాబుకు లేఖ రాశారు.ఈ నెల 6న హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా చర్చిద్దామని ఆహ్వానించారు. "విభజన సమస్యలను కలిసి పరిష్కరించుకుందాం. తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారానికి ముఖాముఖి చర్చలు అవసరం. మీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నా. మా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరఫున చంద్రబాబును ఆహ్వానిస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఏమన్నారంటే...విభజన సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 6న హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి.. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం లేఖ రాశారు. 'ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లవుతోంది. విభజన చట్టం అమల్లో భాగంగా ఉత్పన్నమైన సమస్యలపై పలు దఫాలుగా చర్చలు జరిగినా.. పరిష్కారం కాని అంశాలు ఇంకా ఉన్నాయి. వీటికి సామరస్యపూర్వక పరిష్కారం సాధించేందుకు కట్టుబడి ఉన్నాం. రెండు రాష్ట్రాల సంక్షేమం, పురోగతికి దోహదపడేలా ముఖ్యమైన చిక్కులను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది' అని చంద్రబాబు అభిప్రాయ పడ్డారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖాముఖి చర్చల ద్వారా కీలక అంశాలను పరిష్కరించుకునేందుకు వీలుంటుంది. ఈ చర్చలు మంచి ఫలితాలిస్తాయనే నమ్మకం ఉంది' అని లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సుస్థిర ప్రగతి సాధించడానికి.. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అవసరం. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా ఇది మన బాధ్యత. ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా.. ఉమ్మడి లక్ష్యాలను సాధించేందుకు ఇది కీలకం' అని వివరించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రగతికి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషిని చంద్రబాబు ప్రశంసించారు.

## విలీనమైన ఏడు మండలాలే తొలి ఎజెండా కావాలి

రప్పించడానికి ప్రయత్నం చేయాలన్నారు. దీన్నే మొదటి ఎజెండాగా పెట్టాలన్నారు. ఏడు మండలాలు ఇచ్చిన తర్వాతనే మిగిలిన అంశాలపై ముందుకు వెళ్లాలని హరీష్ రావు అన్నారు. చంద్రబాబు అత్యంత శక్తి వంతుడని.. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆయన చేతిలోనే ఉన్నాయని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వం రెండు నెలల పెన్షన్ బకాయి పడిందన్నారు. పక్క రాష్ట్రంలో చంద్రబాబు పెన్షన్ పెంచితే.. మన సీఎం మాత్రం రెండు నెలలు బకాయి పడ్డారన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ప్రభాకర్ అనే ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారని.. ఆయన ఆత్మహత్య చాలా హృదయ విదారకంగా ఉందన్నారు. రాష్ట్రంలో పరిస్థితికి ప్రభాకర్ ఆత్మహత్య నిదర్శనమన్నారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కూడా పోలీసులు పట్టించుకోవడం లేదని హరీష్ రావు అన్నారు. ఎమ్మార్వో, కలెక్టర్, ఎస్ఐ ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఏ ఒక్కరు పట్టించుకున్నా ప్రభాకర్ ప్రాణాలు దక్కేవన్నారు. బాద్యుల పై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని.. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని హరీష్ రావు అన్నారు.

**చర్చలను స్వాగతించిన కోదండరామ్**

విభజన సమస్యలపై తెలుగు రాష్ట్రాల సీఎంలు చర్చించడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై చర్చించేందుకు ఈనెల 6న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అవనున్నారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీపై ప్రొఫెసర్ కోదండరాం సానుకూలంగా స్పందించారు. పదేండ్ల సమస్యలపై ఇరు రాష్ట్రాల ప్రజలు ఇప్పటికీ ఏడుస్తున్నారని.. సమస్య ముగుస్తుందని ఆశిస్తున్నానని అన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రెండు రాష్ట్రాల ప్రజల తరపున చర్చ చేయడం మంచి పరిణామమని ప్రొఫెసర్ వెల్లడించారు. చంద్రబాబు ఏపీ ప్రజల ప్రతినిధిగా, రేవంత్ తెలంగాణ ప్రజల ప్రతినిధిగా సమస్యలపై చర్చిస్తారన్నారు. ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకోవడం తప్ప వేరే మార్గమే లేదన్నారు. పబ్లిక్ రంగ సంస్థల ఆస్తుల పంపకం, నదీజలాలు, ఉద్యోగుల విభజన అంశాలపై ఒక పరిష్కారం దొరుకుతుందన్నారు. కలిసి మాట్లాడుకుంటే పదేండ్ల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గతంలో సీఎంలుగా ఉన్న కేసీఆర్, జగన్ కలిసి భోజనం చేశారు తప్ప ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో చర్చించలేదని కోదండరాం విమర్శలు గుప్పించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..

### - మంది మావోయిస్టులు మృతి

రాయ్‌పూర్ (ప్రజా మంటలు):

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో 11 మావోయిస్టులు మృతి చెందారు. ఈ విషయాన్ని ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు.ధనంది-కుర్రేవాయ అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందని ఆయన తెలిపారు.ఖోకామెటా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయన్న సమాచారంతో జిల్లా రిజర్వ్ పోలీసులులతోపాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ దళాలు సంయుక్తంగా సోమవారం ఆపరేషన్ ప్రారంభించాయని తెలిపారు. గుర్తించిన మావోయిస్టులు కాల్పులకు దిగారని, దీంతో బలగాలు కూడా ఎదురుకాల్పులు జరిపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని మృతి చెందిన మావోయిస్టుల సంఖ్య పెరిగే అవకాశముందని సుందర్‌రాజ్ తెలిపారు.

## ఆధ్యాత్మిక కార్యక్రమంలో తొక్కిసలాట

మృతిచెందినట్లు వైద్యులు చెబుతున్నారు. ఇది ఓ ప్రైవేటు కార్యక్రమం. సబ్ డివిజినల్ మెజిస్ట్రేట్ అనుమతి ఇచ్చారు. అధికారులే భద్రతా ఏర్పాట్లు చేశారు. కానీ, మిగతా ఏర్పాట్లను నిర్వాహకులే చేసుకున్నారు. క్షతగాత్రులు, మృతుల కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలపైనే దృష్టిసారించాం అని తెలిపారు. దీనికితోడు ఎటా జిల్లాకు చెందిన 27మంది మృతి చెందినట్లు అక్కడి అధికారులు ధ్రువీకరించారు. ఇప్పటివరకు పలు మృతదేహాలను పోస్టుమార్టం కోసం తీసుకువచ్చారు. గాయపడినవారికి చికిత్స అందుతోంది. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడవుతాయని ఇటా చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉమేశ్ త్రిపాఠి మీడియాకు వెల్లడించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, ముగ్గురు చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ విషాదంపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే ఘటనా స్థలం వద్దకు వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని అధికారులను ఆదేశించారు. హాథ్రస్ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తదితరులు విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉంది. కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు యూపీ ప్రభుత్వంతో నిరంతరం టచ్‌లో ఉన్నారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఈ సభ ద్వారా హామీ ఇస్తున్నాని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు.'ఉత్తర్‌ప్రదేశ్ ఘటన బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. స్థానిక యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉంది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాని అమిత్ షా, తెలిపారు. హాథ్రస్ ఘటనలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. స్థానిక యంత్రాంగం అన్ని విధాలుగా సాయాన్ని అందిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. క్షతగాత్రులకు చికిత్స అందించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా. 'ఇండియా' కూటమి శ్రేణులు సహాయక చర్యల్లో భాగం కావాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు రాహుల్ గాంధీ తెలిపారు. భోలే బాబా సత్సంగం కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో తొక్కిసలాట జరిగినట్లు పేర్కొంటున్నారు.

## సైబర్ నేరాలు, గంజాయిపై యుద్ధం చేస్తున్నాం

**- అతిపెద్ద సమస్యగా సైబర్ క్రైమ్ - చదువుకున్న వారు సైతం మోసపోతున్నారు**

**- హత్యలు, ఇతర నేరాల వెనుక గంజాయి ప్రభావం- సినిమా థియేటర్లలో ఈ నేరాలపై ప్రచారం చేయాలి- అవగాహన కల్పించడానికి చిత్రపరిశ్రమముందుకు రావాలి- టీవీ చానళ్లు కూడా సామాజిక బాధ్యతను పంచుకోవాలి - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు -**

**సైబర్‌సెక్యూరిటీ బ్యూరో, టీజీన్యాబ్‌కు కేటాయించిన వాహనాల ప్రారంభం**

హైదరాబాద్, (ప్రజా మంటలు):

రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ బాధితులకు మాత్రమే.. నేరగాళ్లకు కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపడం తమ ప్రభుత్వం బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోకు సంబంధించి 27 ఫోర్ వీలర్స్, 40 బైక్స్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 14 ఫోర్ వీలర్స్, 30 బైక్‌లను ప్రభుత్వం అందజేసింది. ఈ కొత్త వాహనాలను సీఎం రేవంత్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చదువుకున్నవారు కూడా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని, సైబర్ నేరగాళ్ల ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీనంబర్ ఏర్పాటు చేశామని, నేరగాళ్ల నుంచి సైబర్ క్రైమ్ పోలీసులు రూ.31 కోట్లు రాబట్టారని, కొత్త నేర న్యాయ చట్టాలపై కూడా పోలీసులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని, హత్య, అత్యాచారం కన్నా ఈ కాలంలో సైబర్ నేరాలే పెద్దవిగా మారాయన్నారు. మధ్యతరగతి, పేదలే సైబర్ నేరాలకు గురవుతున్నారని, విద్యార్థులు ఎక్కువగా గంజాయికి బానిసలుగా మారుతున్నారని, సమర్థత ప్రదర్శించిన అధికారులకు పదోన్నతులు ఇచ్చే బాధ్యత మా ప్రభుత్వానిది అని, మనం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య డ్రగ్స్, సైబర్ నేరాలు అని, డ్రగ్స్ నేరగాళ్లు తెలంగాణ నేలపై అడుగు పెట్టాలంటే భయపడాలని రేవంత్‌రెడ్డి తెలిపారు. చిరంజీవి ముందుకొచ్చి డ్రగ్స్ వ్యతిరేకంగా అవగాహన వీడియో ఇచ్చారని, డ్రగ్స్‌పై పోరాడుతున్న చిరంజీవిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రేవంత్ ప్రశంసించారు. సమాజాన్ని కాపాడాల్సిన బాధ్యత సినీ పరిశ్రమపై ఉందని, టికెట్లు ధరలు పెంచాలని సినీ పెద్దలు తమ దగ్గరకు వస్తున్నారన్నారు. డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై సినీ పరిశ్రమ అవగాహన కల్పించడం లేదన్నారు. పోలీస్ వ్యవస్థకు కావాల్సిన నిధులు, అధికారులను కేటాయించామని తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ క్రైమ్. నేరాలను ఎదుర్కోవడంలో రాష్ట్రంలో సైబర్ క్రైం టీమ్ సమర్థవంతంగా పని చేస్తోందన్నారు. వారిని నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. డ్రగ్స్ మహమ్మారితో కుటుంబం, వ్యవస్థ నాశనమవుతాయి. దురదృష్టవశాత్తు గల్లీ గల్లీలో డ్రగ్స్ వాడకం విచ్చలవిడిగా పెరిగింది. ఈ క్రమంలో డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించాం. గంజాయి మత్తులో నేరాలు జరుగుతున్నాయి. చిన్నారులపై దాష్టీకం జరుగుతున్న ఘటనలకు కారణం మాదకద్రవ్యాలే. తెలంగాణ యువకులు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా.. సమస్యలపై పోరాటం చేసే సమర్థులుగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ నియంత్రణలో సమర్థవంతంగా పనిచేసినవారికి పదోన్నతి కల్పిస్తాం. ఇందుకు సంబంధించి శాసనసభలో చర్చించి చట్టాన్ని రూపొందిస్తాం. మీడియా.. రాజకీయ వివాదాలపై కాకుండా సమాజంలో సమస్యలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. ఇలాంటి కార్యక్రమాలపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మీడియాపై ఉంది అని రేవంత్ పేర్కొన్నారు. ఇదే సందర్భంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్రీ షరతులు విధించారు. సైబర్ క్రైమ్ , డ్రగ్స్ పై సినిమాల్లో అవగాహన కల్పించాలన్నారు. వందల కోట్ల బ్జడెట్ సినిమా అయినా సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై సినిమాకు ముందు ప్రదర్శించాలన్నారు. సినిమా టికెట్లు పెంచాలని ప్రభుత్వం దగ్గరకు వస్తున్నారని.. కానీ వీటిపై అవగాహన కల్పించడం లేదని ముఖ్యమంత్రి తెలిపారు.డ్రగ్స్, సైబర్ నేరాలపై సినిమాకు ముందు కానీ సినిమా తరువాత అయిన 3 నిమిషాలు వీడియోతో అవగాహన కల్పించాలని... అలా కల్పించకపోతే వారి సినిమాలకు టికెట్లు పెంచే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అలాంటి నిర్మాతలకు, డైరెక్టర్‌లకు, తారాగణంకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు ఉండవని తేల్చిచెప్పేశారు. సినిమా థియేటర్ల యాజమాన్యాలు కూడా సహకరించాలని కోరారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై థియేటర్లలో ప్రసారం చేయకపోతే అలాంటి థియేటర్లకు అనుమతి లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. టీవీ ఛానల్లు కూడా ఇలాంటి నేరాలపై అవగాహనకు సంబంధించిన ప్రకటనలు ప్రసారం చేయాలన్నారు. థియేటర్లలో డ్రగ్స్ నియంత్రణ కోసం ఉచితంగా వీడియో ప్రదర్శించాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. డ్రగ్స్ నియంత్రణ కోసం చిరంజీవి వీడియో సందేశం పంపారని గుర్తుచేశారు. దేశంలోని యువత డ్రగ్స్ బారిన పడొద్దని అవగాహన కార్యక్రమంలో భాగమైనందుకు మెగాస్టార్ చిరంజీవిని అభినందిస్తున్నానని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు అలాంటి వాళ్లు చాలా మంది ముందుకు రావాలని.. సమాజం నుంచి ఎంతో తీసుకుంటున్న సినిమా వాళ్లు, కొంతైనా తిరిగి ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్, సైబర్ క్రైమ్ సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని.. వాటి నియంత్రణకు కృషిచేయాలని కోరారు.

# సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు క్షమాభిక్ష

**- 213 మంది ముందస్తు విడుదల**

**- విడుదల కోరుతూ ప్రజాపాలనతో దరఖాస్తు చేసిన ఖైదీల కుటుంబ సభ్యులు**

హైదరాబాద్ (ప్రజా మంటలు):

రాష్ట్ర ప్రభుత్వం 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. దీర్ఘకాలంగా జైళ్లలో మగ్గుతున్న తమ కుటుంబ సభ్యులను విడుదల చేయాలంటూ ఖైదీల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజా పాలనలో దరఖాస్తులు అందజేశారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ఆధారంగా ఖైదీల ముందస్తు విడుదలకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. దరఖాస్తులను పరిశీలించిన సీనియర్ అధికారులు, అర్హులైన వారి వివరాలను హైలెవల్ కమిటీ ముందుంచారు. హైలెవల్ కమిటీ విడుదలకు అర్హులైన ఖైదీల జాబితాను క్యాబినెట్ ముందు ఉంచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని క్యాబినెట్ ఖైదీల విడుదలకు ఆమోదముద్ర వేసింది. అనంతరం ఆ జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో ఖైదీల ముందస్తు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం చర్లపల్లి జైలు నుంచి 213 మంది ఖైదీలు బుధవారం విడుదల కానున్నారు. వీరిలో 205 మంది యావజ్జీవ శిక్ష పడిన వారు, ఎనిమిది మంది తక్కువ కాలం శిక్షపడిన వారు. వీరందరికి జైలులో వివిధ వృత్తులకు సంబంధించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఇచ్చారు. మెరుగైన ప్రవర్తన ద్వారా సమాజంలో తిరిగి కలిసిపోవడానికి వారందరికీ కౌన్సెలింగ్ ఇప్పించారు.

# నీట్‌పై ఈరోజైనా చర్చించడి

**- విద్యార్థుల్లో విశ్వాసం కలిగించాలి**

**- ప్రధాని మోడీకి రాహుల్ లేఖ**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేఖ రాశారు. నీట్ వ్యవహారంపై లోక్‌సభలో బుధవారం చర్చ జరిగేలా చూడాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా నీట్ అంశంపై చర్చకు ప్రధాని మోదీ నాయకత్వం వహిస్తే సముచితంగా ఉంటుందని విశ్వసిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. జూన్ 28న నీట్ వ్యవహారంపై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించాలని విపక్షాలు కోరగా.. అందుకు నిరాకరించారన్నారు. సోమవారం కూడా ఇదే అంశంపై మళ్లీ చర్చకు అడిగిన విషయాన్ని ఈ సందర్భంగా రాహుల్ గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తామని స్పీకర్ విపక్షాలకు హామీ ఇచ్చారని లేఖలో పేర్కొన్నారు. నీట్ ఆశావహుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన రాహుల్.. ఈ వ్యవహారంపై నిర్మాణాత్మకంగా అడుగులు వేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. నీట్ పరీక్షపై తక్షణమే దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని, ఎందుకంటే ఇది మన ఉన్నత విద్యా వ్యవస్థలో కుళ్లును బహిర్గతం చేసిందన్నారు. గత ఏడేళ్లలో 70కి పైగా పేపర్ లీకేజీలు జరిగాయని, వీటితో 2కోట్ల మంది విద్యార్థులపై ప్రభావం పడిందని పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలు ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు ధైర్యంగా, నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటారని మనవైపే చూస్తున్నారని తెలిపారు. అందువల్ల పార్లమెంట్‌లో జరిగే చర్చ విద్యార్థుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు తొలి అడుగుగా ఉండాలన్నారు. నీట్ అంశం తీవ్రత దృష్ట్యా బుధవారం లోక్‌సభలో చర్చకు సులభతరం చేసేలా చూడాలని అభ్యర్థిస్తున్నట్లు లేఖలో తెలిపారు.

## జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ గడువు పెంపు?

హైదరాబాద్ (ప్రజా మంటలు):

జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ గడువును జులై 31 వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలు అంశాలపై విచారణ కోసం ప్రభుత్వం జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను ఏర్పాటు చేసింది.ఏప్రిల్ 7న విచారణ ప్రారంభించిన కమిషన్.. జూన్ 30న నివేదిక ఇవ్వాల్సి ఉంది. కానీ, విచారణ ఇంకా పూర్తి కాలేదు. ప్రక్రియ కీలక దశలో ఉంది. విచారణ పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న ఎస్.ఎ.ఎం రిజ్వీని ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసి.. ఆయన స్థానంలో రొనాల్డ్ రోస్‌ను నియమించింది. ఇంధనశాఖతో పాటు జెన్ కో, ట్రాన్స్ కో సీఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు రొనాల్డ్ రోస్‌కు అప్పగించింది. ఆయన బాధ్యతలు స్వీకరించి శాఖపై అధ్యయనం చేస్తున్న క్రమంలోనే కమిషన్ గడువు ముగిసింది. దీంతో విచారణ కమిషన్ గడువు మరో నెలరోజుల వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# ములుగు జిల్లా పేరు మార్పు!

**-సమ్మక్కసారలమ్మ ములుగు జిల్లాగా నామకరణం**

**- నేడు ప్రజాభిప్రాయ సేకరణకు రంగం సిద్ధం**

**- మంత్రి సీతక్క చొరవతో మార్చేందుకు యత్నం**

ములుగు (ప్రజా మంటలు):

ములుగు జిల్లా పేరు మార్పుకు కసరత్తు మొదలైంది. ఆ జిల్లాను సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా పేరు మారుస్తూ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అభ్యంతరాల స్వీకరణకు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. తాజాగా ములుగు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సీతక్క ఒక అడుగు ముందుకు వేశారు. ములుగును సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా పేరు మార్చే పక్రియకు శ్రీకారం చుట్టారు. మంత్రి చొరవ ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ దినకర్ పేరు మార్పుకు చర్యలు మొదలు పెట్టారు. సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా పేరు మారుస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 3వ తేదీ బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే గ్రామ సభలలో వారి అభ్యంతరాలు, సూచనలు తెలియపర్చవచ్చని సూచించారు. హిందీ, ఇంగ్లీష్ తెలుగు మూడు భాషలలో వారి అభ్యంతరాలు తెలియపరచాలి సూచించారు. జిల్లాల విభజన సమయం లో జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి అనేక పోరాటాల ఫలితంగా ములుగు జిల్లా ఏర్పడింది. 9 మండలాలతో కూడిన ఈ అడవుల జిల్లా ఓ చారిత్రక జిల్లాగా ఏర్పడింది. ఆరంభం నుండి ఈ జిల్లాను సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా ఏర్పాటు చేయాలని అనేక వినతులు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. కానీ పేరు మార్పు ప్రతిపాదన ఆచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో బుధవారం గ్రామసభ అనంతరం ఈ తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారు. గెజిట్‌లో ములుగుకు జిల్లా సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా ఆమోదముద్ర లభిస్తుంది. మేడారం సమ్మక్క సారక్క దేవతలు కొలువుదిరిన ఈ జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. పర్యాటక కేంద్రంగా కూడా విరాజిల్లుతుంది. యూనేస్కో గుర్తింపుపొందిన రామప్ప దేవాలయం కూడా ఈ జిల్లాలోనే ఉంది. సమ్మక్క సారక్క దేవతల పేరు చెప్పగానే ములుగు జిల్లా గుర్తుకొస్తుంది. కాబట్టి సమ్మక్క సారక్క ములుగు జిల్లాగా ఈ జిల్లా పేరును మార్చాలని స్థానిక ప్రజలు అనేకమార్లు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక మంత్రి సీతక్క చొరవతో ఎట్టకేలకు ఆ కల నెరవేరబోతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## 'నీట్ పీజీ' పరీక్ష రీ షెడ్యూల్

## అధికారుల కీలక నిర్ణయం

### పరీక్షకు 2 గంటల ముందు ప్రశ్నపత్రం సిద్ధం చేసే యోచన

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

నీట్ యూజీ-2024 పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా వివాదం నెలకొన్న వేళ నీట్ పీజీ 2024 పరీక్ష నిర్వహణను కేంద్రం వాయిదా వేసిన సంగతి తెలిసిందే. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. అయితే, ఈ నెలాఖరు లేదా ఆగస్టులో నీట్ పీజీ పరీక్ష ఉండొచ్చని తెలుస్తోంది. దీనిపై ఈ వారంలోనే రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇక, పరీక్షలో అక్రమాలకు తావులేకుండా ఉండేలా చివరి గంటల్లోనే ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేయాలని అధికారులు యోచిస్తున్నారట..! జూన్ 23న జరగాల్సిన నీట్ పీజీ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు పరీక్షకు ఒక రోజు ముందు ప్రకటించారు. రివైజ్డ్ షెడ్యూల్‌ను మంగళవారం (జులై 2న) ప్రకటించనున్నట్లు తొలుత వార్తలు వచ్చాయి. అయితే పరీక్ష తేదీని నేడు వెల్లడించలేమని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సీనియర్ అధికారి తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం తాము సిద్ధం చేసిన ప్రణాళికను కేంద్రం ఇంకా ఆమోదించలేదని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తర్వాతే షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. జులై చివర్లో లేదా ఆగస్టులో పరీక్ష నిర్వహించే అవకాశాలున్నాయని ఆ అధికారి తెలిపారు. జులై 5వ తేదీలోగా షెడ్యూల్‌ను వెల్లడిస్తామన్నారు. ఇక, నీట్ యూజీ పేపర్ లీకేజ్ వివాదం నేపథ్యంలో నీట్ పీజీ పరీక్ష నిర్వహణకు ఎగ్జామినేషన్స్ బోర్డు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పరీక్షకు కేవలం 2 గంటల ముందు ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసి సెంటర్లకు పంపించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది.ఇదిలా ఉండగా.. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన యూజీసీ నెట్ 2024 పరీక్షకు సంబంధించి కొత్త తేదీలను జాతీయ పరీక్షల సంస్థ (ఎన్టీఏ) ఇటీవల ప్రకటించింది. ఆగస్టు 21, సెప్టెంబర్ 4 మధ్య ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొంది. అంతకుముందు నిర్వహించిన పెన్ను, పేపర్‌కు బదులుగా ఈ సారి కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది.

# నీట్‌పై పిటిషన్లు..

## - 8 నుంచి సుప్రీం కోర్టు విచారణ

దిల్లీ (ప్రజా మంటలు):

దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్-యూజీ 2024 పరీక్షలో అవకతవకలు, లీకేజీలపై దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం కొనసాగుతోంది.ఆ పరీక్షను రద్దు చేసి మళ్లీ కొత్తగా నిర్వహించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై భారత సర్వోన్నత న్యాయస్థానం లో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా 26 పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం జులై 8న విచారణ చేపట్టేందుకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో తాజా అప్‌డేట్ వచ్చింది. నీట్-యూజీ పేపర్ లీకేజీ ఆరోపణలు రావడంతో కొత్తగా పరీక్ష నిర్వహించాలని జూన్ 11న సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పరిశీలించిన సుప్రీం ధర్మాసనం.. పరీక్ష పవిత్రత దెబ్బతిందని వ్యాఖ్యానించింది. అయితే, కౌన్సెలింగ్‌ను నిలిపివేసేందుకు నిరాకరించిన న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను ఆదేశించింది. అభ్యర్థుల్లో 1563 మందికి గ్రేస్ మార్కులు కలపడం, నీట్‌ను రద్దు చేయడం, ఓఎంఆర్ షీట్లు అందకపోవడం, న్యాయస్థానం పర్యవేక్షణలో దర్యాప్తు వంటి అంశాలతో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించనుంది.మే 5న దేశవ్యాప్తంగా 4750 కేంద్రాల్లో నిర్వహించిన నీట్-యూజీ 2024 పరీక్షకు దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీటి ఫలితాలను జూన్ 14న వెల్లడించాలని ఎన్టీఏ భావించినప్పటికీ.. ముందస్తుగానే జవాబు పత్రాల మూల్యాంకనం ముగియడంతో జూన్ 4నే ఫలితాలు వెల్లడించింది. అయితే, పరీక్షలో అవకతవకలు, పేపర్ లీకేజీ ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా ఆందోళనలకు కారణమయ్యింది. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీబీఐ.. బిహార్‌లో ఇప్పటికే పలువురు అనుమానితులను అరెస్టు చేసింది.

# విద్యా, వైద్యానికి పెద్ద పీట వేస్తాం

**రాష్ట ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు**

**ఎస్పీ కాలేజీలో ఆడిటోరియం ప్రారంభం**



సికింద్రాబాద్ జూలై 02 ( ప్రజామంటలు):

తమ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తుందని, ఇందుకు అవసరమైన నిధులను ఖర్చు చేయడానికి వెనుకంజ వేసేది లేదని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, నాంపెల్లి ఎగ్జిబిషన్ సొసైటీ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం పద్మారావునగర్ లోని సర్దార్ పటేల్ కాలేజీ లో ఇటీవల నూతనంగా నిర్మించిన ఆడిటోరియం, కామర్స్ వింగ్ బిల్డింగ్ లను మంత్రి ప్రారంభించారు. ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన ఎస్పీ కాలేజీలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశ, విదేశాలలో ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ద్వారా అనేక కాలేజీలు, విద్యాసంస్థలు సేవా భావంతో పనిచేయడం అభినందనీయమన్నారు. కాలేజీలో ఉత్తమ సేవలు అందిస్తున్న పరిపాలనాధికారి రాహుల్ యాదవ్, సూపరింటెండెంట్ జావిద్ హుస్సేన్ లను మంత్రి శ్రీధర్ బాబు ఘనంగా సన్మానించారు. కాలేజీ పాలకమండలి చైర్మన్ ఎస్. రాజేందర్, సెక్రటరీ బి. సురేందర్ రెడ్డి, ట్రెజరర్ సూరజ్ సింగ్, ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సత్యేందర్, సభ్యులు, ప్రిన్సిపాల్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ అమర్ నాథ్ శర్మ, ఎస్ఎస్ఎస్ ఆఫీసర్ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ ఈదురు లక్ష్మణ్ ని సన్మానించిన గ్రామ నాయకులు

రాయికల్ జులై 02 (ప్రజామంటలు):

రాయికల్ మండలం వడ్డే లింగాపూర్ గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు ఈదుల లక్ష్మణ్ కుమార్ మానవ సేవే మాధవ సేవ అని మార్గంలో నడుస్తూ అనేక ప్రైవేటు వైద్యుల సహకారం మారుమూల ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి నీరుపేదల ఆరోగ్య అభివృద్ధికి తోడ్పడ్డారు. కరోనా సమయంలో భయపడ కుండా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు అందించారు. తగిన సలహాలు ఇస్తూ గ్రామీణ ప్రాంతాలలో విశిష్టమైన సేవలను పేద ప్రజలకు అందించినందుకు గాను గుర్తించి కరీంనగర్ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి జయంతి ఉత్సవాలు 2024 సందర్భంగా జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సాహితి వేదిక స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, ప్రముఖ హాస్య నటుడు నంద శాంతి కృష్ణ గ్రామీణ వైద్య రంగంలో లక్ష్మణ్ చేసిన సేవలను గుర్తించి అవార్డు గ్రహీతగా ఎంపిక చేసి కరీంనగర్ లో జరిగిన పీవీ నరసింహారావు జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన కు గౌతమ బుద్ధ పూర్ణిమ అవార్డును ప్రధానం చేశారు. అవార్డు పొంది ఒడ్డెలింగాపూర్ గ్రామాన్ని జాతీయ స్థాయిలో తెలిసేల చేసిన లక్ష్మణ్ కుమార్ ని పలువురు గ్రామ పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో సామాజిక జానపద రచయిత గాయకుడు మరియు జిల్లా దిశా కమిటీ సభ్యులు భూక్య గంగాధర్ నాయక్, సర్పంచ్ పాలకుర్తి రవి, బండారి సాయిరాజ్ గౌడ్, మారంపల్లి రమేష్, బాణావత్ రమేష్, బోదాసు జలపతి, సురేందర్, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.





## జడ్పీ వీడ్కోలు సమావేశంలో జడ్పీ ఫ్లోర్ లీడర్

# రవీందర్ ఘన సత్కారం

చిగురుమామిడి జులై 02 (ప్రజామంటలు):

కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశం అనంతరం జరిగిన వీడ్కోలు సమావేశములో జడ్పీటీసీలకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ హాజరై జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ ను ఘనంగా సన్మానించారు. శాలువ కప్పి పూల మాలతో సత్కరించి, మెమెంటో బహుకరించారు. అనంతరం చిగురుమామిడి మండల కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో విచ్చేసి జడ్పీటీసీకి ఘనమైన సత్కారం చేశారు. ఈ కార్యక్రమములో డిసిసి ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, పన్యాల శ్యామ్ సుందర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ చీల లక్ష్మా రెడ్డి, సీనియర్ నాయకులు గునుకుల రాజేశ్వర్ రెడ్డి, గట్టు ప్రశాంత్, విష్ణుమా చారి, పోటు మల్లారెడ్డి, కల్వల రాజేశ్వర్ రెడ్డి, కాంట్రాక్టర్ కాంతాల తిరుపతి రెడ్డి, భూపతి శ్రీనివాస్ రెడ్డి, అనువోజు బాలకృష్ణ, కోనేటి అంజి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## పామ్ ఆయిల్ తోటల సాగుపై రైతుల క్షేత్ర స్థాయి విజ్ఞానయాత్ర

భీమదేవరపల్లి జూలై 01 (ప్రజామంటలు):

కేఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఫామ్ ఆయిల్ సాగు రైతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల ఉద్యానవన శాఖ అధికారి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ, పామ్ ఆయిల్ సాగును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. హనుమకొండ డివిజన్ లోని వివిధ మండలాల రైతులతో కలిసి ఆయిల్ ఫామ్ సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గంగారం, కాకర్లపల్లి గ్రామాలలోని ఆయిల్ ఫామ్ తోటలను సందర్శించారు. ఆయిల్ ఫామ్ తోటలో అంతర్ పంటల సాగుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై వివరించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల దిశగా ఆలోచన చేయాలని అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు లాభాలపై, రైతులకు నమ్మకం కలిగించేందుకు ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులతో నేరుగా మాట్లాడించేందుకు రైతులను క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకు వెళ్ళామని అన్నారు. అనంతరం అప్పారావుపేట లోని ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని రైతులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి బి మానస, కే ఎన్ బయో సైన్సెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి కే. రంజిత్, ఫీల్డ్ ఆఫీసర్స్, రైతులు పాల్గొన్నారు.



# పడగొట్టిన ప్రజాస్వామ్యం ..తొడగొడుతోంది !

చాలాకాలం తరవాత అంటే...పదేళ్ల తరవాత పార్లమెంటులో ప్రజాస్వామ్యం కనిపిస్తోంది. గతంలో లాగా ప్రధాని మోడీ కాలర్ ఎగరేసే పరిస్థితి లేదు. పూర్తిస్థాయి మెజార్టీ లేక పోవడంతో..చిన్నచూపు చూసిన నేతల ముందు మోకరిల్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. అలాగే విపక్షం కూడా బలంగా ఉంది. దేశ ప్రజాస్వామ్యంలో ఇదో మార్పుగా చూడాలి. అందుకే పార్లమెంటులో చర్చలకు అవకాశం వస్తోంది. విపక్ష సభ్యులు స్వేచ్ఛగా తమ గళాన్ని వినిపిస్తున్నారు. స్పీకర్ ఓం బిర్లా కూడా విపక్ష సభ్యులకు గౌరవం ఇచ్చి వారిని చర్చల్లో పాల్గొనేలా చేస్తున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానంలో భాగంగా విపక్షనేత రాహుల్, సమాజ్‌వాదీ నేత అఖిలేశ్ యాదవ్ తదితరులు పార్లమెంటులో నిర్భయంగా తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందులో తప్పులు తీసేస్తే.. నిజాలు కూడా చాలా ఉన్నాయి. వారి విమర్శలను సూచనలుగా తీసుకుంటే ప్రజలకు మేలు కలుగుతుందని మోడీ గుర్తించాలి. పార్లమెంటులో ఈ పరిణామం ఇక బిజెపిలో కూడా రావాల్సి ఉంది. ఎందుకంటే బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా పోయింది. ఏ అంశంపైనా, తీసుకునే నిర్ణయంపైనా పార్టీలో చర్చించిన దాఖలాలు లేవు. గత పదేళ్లుగా నిరంకుశ విధానాలు సాగాయి. దేశం ఎటు పోతుందో ..ఏ నిర్ణయం తీసుకుంటున్నారో కూడా తెలియదు. ఎంతో హుందాగా, దేశం కోసం వాజ్‌పేయ్, అద్వానీ లాంటి వారు భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేసి,ప్రజల్లో కొత్త ఆశలను నింపారు. బిజెపిని ప్రజాస్వామ్య పార్టీగా, దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీగా తీర్చిదిద్దారు. కానీ వారి ఆశలు అడియాశలు అయ్యాయి. పెద్దలంతా తెరమరుగయ్యారు. పాతతరం నేతలకు ప్రవేశం లేకుండా చేశారు. ఒక క్రమపద్ధతిలో వారిని తప్పించారు. పార్టీలోనూ,పార్లమెంట్ లోనూ సీనియర్లు అన్న వాసన లేకుండా చేశారు. ఇప్పుడు పార్టీలో ఇద్దరి పెత్తనమే సాగుతోంది. అందుకే పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడ్డది. చాయ్‌వాలాగా చెప్పుకుంటున్న మోడీ అధికారం చేపట్టిన తరవాత చేస్తున్న విన్యాసాలతో భారత ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. గత యూపిఎ ప్రభుత్వాన్ని గద్దె దింప, మోడీని అందలం ఎక్కించినందకు పదేళ్లుగా నానా అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా గ్యాస్ ధరలు, జిఎస్టీ వాతలు చాలు.. ఈ దేశ ప్రజలు ఎంతగా దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారో చెప్పడానికి. ఇకపోతే నిరుద్యోగం ఎలాగూ పెరిగింది. ఉద్యోగ కల్పన లేదు. చివరకు ఆర్మీలో కూడా అగ్నివీర్ పథకం పేరుతో నాలుగేళ్ల సర్వీస్‌తో ఉద్యోగాల భర్తీ మొదల య్యింది. ఇంతకన్నా దారుణం ఉంటుందా అన్నది చూడాలి. ఇకపోతే ఉద్యోగాల భర్తీ అన్నదే మర్చి పోయారు. సంస్థలను తెగనమ్మేయడం, బ్యాంకులను ముంచినోళ్లు దేశం దాటివెళ్లినా..చూస్తూ ఉండడం చూస్తున్నాం. ప్రజలు మామూలు బట్టలు కూడా కట్టుకోలేని దుస్థితిలో ఉంటే మోడీ మాత్రం ఖరీదైన సూట్లు వేస్తుంటారు. కట్టిన బట్ట మళ్లీ కట్టకుండా రంగురంగుల ఖరీదైన బట్టలు వేస్తున్నారు. చాయ్ అమ్మిన వ్యక్తి ఇంతగా ఎదిగనందుకు భారతీయ ప్రజలు ఆనందించాల్సిందే. అలా అందరూ ఎదిగితేనే మనదేశ జిడిపి, ఆర్థిక వ్యవస్థ బాగా ఎదిగినట్లుగా మోడీ ఎప్పుడు గుర్తిస్తారో చూడాలి. ఈ క్రమంలో పదేళ్ల కాలం గిర్రున తిరిగింది. అయోధ్య, 370 ఆర్టికల్ పేరు చెప్పి ఓట్లు అడిగినా ప్రజలు నమ్మలేదు. మోడీ పాలనలో నిజాయితీ లేదని గుర్తించారు. అందుకే అయోధ్యలోనూ ఓడించారు. ఇవన్నీ సత్యాలు. ఈ సత్యాలు మాట్లాడితే మోడీకి కోపం వస్తుంది. గత పదేళ్లలో విపక్షం గట్టిగా లేకపోవడం వల్ల వారిని గెంటివేసి పాలన చేశారు. ఇప్పుడా పరిస్థితి లేదు. భారత ప్రజాస్వామ్యం గొప్పదనం ఇప్పుడు కనిపిస్తోంది. గడచిన పదేళ్లలో నరేంద్ర మోడీ నాయకత్వాన కేంద్ర ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపే అవకాశం వచ్చింది. రాష్ట్రపతి ప్రసంగంలో కనిపించిన అతిశయాలను ఎండగట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాలను వెల్లడించాల్సిన రాష్ట్రపతి ప్రసంగం సొంత డబ్బా కొట్టుకునేలా పాత చింతకాయ పచ్చడిలా సాగింది. నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్త విషయమేమీ చెప్పలేదు. పేపర్ లీక్ దోషుల్లో ఇసుమంత భయం కూడా లేకుండా పాలన సాగుతోంది. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలను వాటికి పరిష్కారాలను లేదా కనీస ఉపశమనం కల్పించడం గురించైనా ప్రస్తావించలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వైనాన్ని పదేపదే విమర్శిస్తున్నా వాటిగురించి ప్రస్తావించ కుండా ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో ముఖ్యంగా చర్చనీయాంశమైన అగ్నిపథ్ ఊసే ఎత్తలేదు. ముఖ్యమైన ఎలాంటి చర్చ లేకుండా గిలెటెన్ చేయడం, సభలో హోంమంత్రి వివరణ ఇవ్వాలని కోరినందుకు 140 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం వంటివన్నీ ఇక గతంలో చూశాం. గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగిస్తున్న సంగతి వదిలేసి 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకున్న అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. మహిళా రిజర్వేషన్ చట్టం ఇంకా ఆచరణకు రాకపోయినా మహిళా సాధికారతకు ఎంతగానో కృషి జరిగిందని చెప్పుకోవడం దారుణం. వ్యవసాయ చట్టాలను తేవడం, వదిలించుకోవడం కూడా జరిగింది. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీలను తుంగలో తొక్కారు. అందుకే ప్రజలు గడచిన రెండు సాధారణ ఎన్నికలకు భిన్నంగా బిజెపికి సొంతంగా మెజార్టీని ఇవ్వలేదు. అయినా మోడీ-అమిత్ షా ద్వయం గతంలో మాదిరిగానే పాలన సాగించాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ నిర్మొహమాటంగా అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్దాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదా లో తొలిసారిగా మాట్లాడారు. నిజంగా గతంలో ఇలా మాట్లాడే అవకాశం ఎవరికీ లేదు. ఇప్పుడు విపక్ష సభ్యులు మాట్లాడే అవకాశం తెచ్చుకున్నారు. అధికార కూటమితో తలపడేంతగా విపక్ష బలం పెరిగింది. రాహుల్, అఖిలేశ్ యాదవ్ల ప్రసంగంలో పచ్చి నిజాలు ఉన్నాయి. ప్రజలు ఆకలిబాధలు లెక్కలేయాని అఖిలేశ్ చేసిన వ్యాఖ్యలు దేశంలోని పరిస్థితులకు అద్దం పట్టింది. జిడిపి లెక్కలు, దేశం ఆర్థికంగా ఐదో స్థానంలో ఉందన్న లెక్కలు అబద్దాలని తేల్చేశారు. మొత్తంగా ప్రజాస్వామ్యం తలెత్తుకుంది. అందుకు పార్లమెంటులో సాగుతున్న ప్రసంగాలే నిదర్శనంగా చూడాలి.

## కవిత్వం

**పాళీట్రిక్స్‌జి**

సెక్యులర్ పార్టీలతో దోస్తీ
కలిసొచ్చేనా కమలానికి,
హిందూ దేవదూతకైనా
తప్పని విధి వైపరీత్యం!
నిరంకుశపు ధోరణి
అహంకారపు పాలన,
నేర్పుతుంది గుణపాఠం
అందుకే తిర్లబడ్డది భజన!

న్యాలకంటి నారాయణ
ఫోన్ 9346200066

**(అ)రాజకీయం**

అవినీతికి అసహనం ఎక్కువ
నిజాయితీకి నిదానం ఎక్కువ
కోరికకు కోపం ఎక్కువ
ఆశకు అంతం లేదెక్కడ
రాజకీయానికి రాజీ లేదక్కడ
పదవులకోసం పరువెందుకిక్కడ
విలువలకి తిలోదకాలు ఇవ్వటం
అధికారం కోసం పార్టీ మారటం
కార్యకర్తల కోసమే అంటూ రాగం
ఇసుకను పిండి నూనె తీయవచ్చు
పక్కింటిగోడ పంచాతి గెల్వవచ్చు
నాయకుల మనసు తెల్వవశమే
ఇలను.
ఎన్నికలు తావచ్చిన వచ్చున్
ఎన్నిలకైపోయిన పోవున్
ఇచ్చిన మాటలు నీటి మూటలు కాగన్

బి.అనసూయ. నిజామాబాద్

## కరువు కథ



మిట్ట మధ్యాహ్నం చంద్రమ్మ తన పొలం దగ్గర ఉన్న చల్లని ఆ చింత చెట్టు నీడన కూసోని, ఎండకు మెరుస్తున్న ఆ వరి పొలాన్ని చూస్తూ కళ్ళెంట నీలెట్టుకుంది.

అటుగా వచ్చిన ఆమె పెనిమిటి బాల పీరు, ఏడుస్తున్న తన పెళ్ళాం పక్కన కూసొని పచ్చడి మెతుకులు, పప్పు కలిపిన అన్నం డబ్బా ఆమెకిస్తూ, ఇన్నేళ్లు గడిసిన అవే ఆలోసిస్తే ఎట్టాగే అంటూ తన తుండుగుడ్డతో ఆమె కళ్ళు తుడిచినాడు.

పక్కనే కూసున్న ఆమె , పెనిమిటితో ఇప్పుడున్నట్టే అప్పుడు గూడా ఉంటే బాగుండు కదయ్యా అంటూ తన కొడుకు సీనయ్య, బిడ్డ రేణమ్మ గురించి ఆలోసిస్తూ మళ్లీ ఏడిసింది.

చంద్రమ్మ, బాల పీర్లది పాలమూరు జిల్లాలోని ఓ మాలమూరు గ్రామం. ఉన్న రెండు ఎకరాలు కరువుకి బీడు బడింది. సేసేది లేక వారి పెళ్లైన పదేళ్లకు పుట్టిన పిల్లలని తోలుకొని హైదరాబాదు వెళ్లి అక్కడ అపార్ట్మెంట్లో కూలి పనికి సేరినారు.

పిల్లలు సంటోళ్లు కావడంతో, పిల్లల్ని వాళ్ళ గుడిసెలోనే వదిలి అపార్ట్మెంట్ పనికి ఇటుకలు మోసేవారు. సాయంకాలానికి భుజాలు, నడి నెత్తి పుండ్లు అయ్యేవి. ఎలాగైతేనేమి పిల్లల కడుపు మూడు పూటలా నిండుతుందని సర్దుకుపోయారు. అట్టాగే ఆరేడు నెలలు గడిసాయి. ఓనాడు మధ్యాహ్నం రేణమ్మ, సీనయ్యకు బువ్వ తినబెట్టి, పక్కనే ఉన్న ఇసుకలో ఆడి ఆడి అలిసినాక గుడిసెలో పండుకున్నారు.

లేసేసరికి తమ్ముడు గుడిసెలో లేడు. బిక్కుబిక్కుమంటూ కళ్ళనిండా నీళ్లతో అంతా కలియ చూసింది. తమ్ముడు యాడ కనిపియ్యలే. కాసంత దూరంలో రోడ్డుమీద మంది గుమ్మి కూడడంతో అటు లగెత్తింది రేణమ్మ. రోడ్డు మీద రక్తం మడుగులో తమ్ముని సూసేసరికి గుండె ఆగినంత పని అయింది ఆ పసిబిడ్డకి.

గుండెని రాయి జేసుకుని ఆ గుండెల మీద పాణం బోయిన సీనయ్యని, సీనయ్యని అట్టా సూసి సగం పాణం బోయిన బిడ్డ, పెళ్ళాన్ని తోలుకొని సొంతూరికి వచ్చాడు బాల పీరు.




కరువుకి కడుపు కాలినా, తన కొడుకుని కట్టెల మీద పండుకోబెట్టిన హైదరాబాదుకు మాత్రం పోవద్దంది చంద్రమ్మ. తప్పేది లేక ఊర్లోనే దొరికిన కూలి పనికి పోయేవారు చంద్రమ్మ బాల పీర్లు. వచ్చే కూలి పైసలు కూడు, గుడ్డకే అంతంత మాత్రం సరిపోయేవి. వాటితో ఉన్న ఒక్క బిడ్డకి సదువు చెప్పించలేక అప్పుడప్పుడు రేణిను కూడా వాళ్లతో కూలి పనికి తీసుకుపోయేటోళ్లు.

తక్కువ కట్నం అడుగుతున్నారని, పిల్లోడు దూరపు సుట్టమేనని రేణికి పదనాలుగు ఏండ్లకే పెళ్లి జేశారు. సిన్న వయసు, శక్తి లేని శరీరం కావడంతో మూడుసార్లు గర్భం నిలబడలేదు ఆ పిల్లకి. నాలుగోతూరి కాన్పులో ఆ పిల్లకు ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని కట్టుకున్నోడి, అత్తారింటి వారి వేధింపులు పడలేక, ఆ పిల్ల కన్నోలని, కన్న బిడ్డను కాదనుకొని పాణాలు తీసుకుంది.

అట్టా ఇద్దరు బిడ్డలని పోగొట్టుకున్న చంద్రమ్మ, పిల్లల్ని, తన పిల్లల్ని మింగేసిన ఆ కరువుని, తన పేదరికాన్ని తలుసుకుంటూ ఏడ్సని రోజంటూ లేదు.

అటుగా ఉరికొస్తున్న రేణి బిడ్డని తన ఒళ్లో కూసోబెట్టుకుంటూ, ఆ దేవుడి పుణ్యమా అని కరువు బాయే, ఉన్న అప్పులు తీరిపాయే. ఆ పచ్చని పంట చూసుకుంటూ, బంగారంలా సదువుకుంటున్న నా మనవరాలి ని సూసుకుంటూ అయినా ఈ నాలుగు మెతుకులు నవ్వుకుంటూ తినరాదే నా చంద్రమ్మ అంటూ, అన్నం ముద్ద ఆమె నోటి కాడ పెట్టాడు బాల పీరు.

నమ్రతజి
9704660656

# తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవ కారకులు రావిచెట్టు రంగారావు

## నిజాం ఇలాకాలో తొలి తెలుగు గ్రంథాలయ స్థాపకులు రావిచెట్టు రంగారావు

### జూలై 3... రావిచెట్టు రంగారావు వర్ధంతి



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

నిజాం రాజ్యంలో తొలి తెలుగు గ్రంథాలయం స్థాపన ఎప్పుడు ఎక్కడ జరిగిందో చాలా మందికి తెలియదు. అప్పటి రాంకోఠిలోగల రావిచెట్టు రంగారావు బంగాళాలో స్థాపించడం జరిగింది. నాటి వ్యవస్థాపక సమావేశానికి పాల్వంచ, భద్రాచలం సంస్థానాధిపతి రాజా పార్థసారథి అప్పారావు అధ్యక్షత వహించారు. ఆ గ్రంథాలయం తొలి అధ్యక్షుడుగా రాజానాయని వెంకట రంగారావు బహదూర్, కార్యదర్శిగా రావిచెట్టు రంగారావు ఎన్నికయ్యారు. మరునాటి నుంచే రంగారావు తెలుగు గ్రంథాలయ ఆవశ్యకతను తెలుగు ప్రజానీకానికి వివరించి చెబుతూ, మంచి గ్రంథాల సేకరణకు ఉపక్రమించారు.

1897 సంవత్సరంలో రంగారావు కొందరు మరాఠీ మిత్రుల సహకారంతో చతుర్వేదములు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణములు, కావ్యాలు, నాటకాలు, ఇతర సంస్కృత గ్రంధాలతో కూడిన 'శ్రీ శంకర భగవద్ పూజ్య పాద గీర్వాణ మంజూష' అనే గ్రంథాలయాన్ని తమ ఇంటిలోనే నిర్వహించేవాడు. తొలుత కొంతకాలం తమ బంగళాలోనే నిర్వహించబడ్డ భాషానిలయానికి రావిచెట్టు సహధర్మచారిణిలక్ష్మీనరసమ్మ సేవలను అందించేది. ఆమెనే శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయముకి అవసరమైన ఇల్లు కొనడానికి 3,000 రూపాయలు విరాళ మివ్వగా, ఆ డబ్బుతో ఇప్పుడు సుల్తాన్ బజార్ లో భాషా నిలయం భవనం ఉన్న చోటనే 1910లో ఒక పెంకుటిల్లు కొని, కొన్ని మార్పులు చేసి అందులో గ్రంథాలయం నెలకొల్పడం విశేషం.

రావిచెట్టు రంగారావు (డిసెంబర్ 10, 1877 – జూలై 3, 1910) తెలంగాణలో విద్యావ్యాప్తికి విశేష కృషి చేసిన ప్రముఖులు. రంగారావు 1877, డిసెంబర్ 10 న నరసింహారావు, వేంకమాంబ దంపతులకు నల్లగొండ జిల్లా, దండంపల్లి గ్రామంలో జన్మించారు.తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించారు. ఆయన వివాహం 13వ యేట లక్ష్మీ నరసమ్మతో జరిగింది.

తల్లిదండ్రుల ఆస్తిపాస్తులు మొత్తం రంగారావుకు సంక్రమించగా, తండ్రినుంచి సంక్రమించిన 'మున్సబుగిరి' స్వీకరించి 'మున్సబుదారు' అయ్యారు. తెలుగుతోపాటు హిందీ, మరాఠీ, ఇంగ్లీషు, సంస్కృతం భాషలు నేర్చుకున్నారు. తెలుగంటే వారికి వల్లమాలిన అభిమానం. మత, సాంఘిక, రాజకీయాల్లోనూ వారికి సరైన అవగాహన ఉండేది.

రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావుతో కలసి శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం, పిమ్మట విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. సంస్కృత భాషపై ఆయనకు ఎనలేని గౌరవం. ఒక సంస్కృత గ్రంథాలయాన్ని స్థాపించి, దాని అభివృద్ధికి తోడ్పడి "శ్రీ శంకర భగవత్పూజ్యపాద గీర్వాణరత్న మంజూష" అన్న పేరుతో సంస్కృత గ్రంథాలయాన్ని ఆ గ్రంథాలయంలో కలిపారు. అందులో చతుర్వేదాలు, దశోపనిషత్తులు, అష్టాదశ పురాణాలు, కావ్యాలు, నాటకాలు ఇత్యాది సంస్కృత ప్రబంధాలెన్నో కొనుగోలు చేసి సేకరించి పాఠకుల సౌకర్యార్థం ఉంచారు. ఆ గ్రంథాలయం తాలూకు రెండువేల రూపాయల విలువపై వచ్చే వడ్డీతో ప్రతియేట కొత్తగా వచ్చే సంస్కృత గ్రంథాలు కొనుగోలు చేసేవారు. అలా గ్రంథాలయం మొదట రంగారావు ఇంట్లోనే స్థాపించ బడింది. దాదాపు ఐదేండ్లపాటు కార్యదర్శిగా ఉన్నారు.

హైదరాబాద్ లో శ్రీకృష్ణదేవరాయల పేరిట గ్రంథాలయం స్థాపించినట్టే, 1904 జనవరి 26న రాజా నాయిని వెంకటరంగారావు బహద్దూర్ సహకారంతో హనుమకొండ లో 'రాజరాజ నరేంద్ర' గ్రంథాలయాన్ని 1904 లో స్థాపించారు. ఆ గ్రంథాలయం కోసం అనేక ముద్రణాలయాలకు, గ్రంథ విక్రయ శాలలకు లేఖలు వ్రాసి అనేక గ్రంథాలు ఉచితంగా, కొన్ని సగం ధరకు, మరికొన్ని పాతికశాతం ధరకు తెప్పించి ఇచ్చారు. హనుమకొండలో బ్రిటిష్ పోస్టాఫీసు లేనందున గ్రంథాలను, పత్రికలను తమ పేరున హైదరాబాద్‌కు తెప్పించి హనుమకొండకు పంపేవారు. అంతే కాకుండా భాషా నిలయానికి స్వంత గృహవసతి కల్పించడానికి కూడా రంగారావు చాలా కృషి చేశారు.

మునగాల రాజు, కొమర్రాజు లక్ష్మణరావుల సహచర్యంతో రంగారావు మద్రాసుకు తరచూ వెళ్ళేవారు. అక్కడ 1905 లో విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి స్థాపించి పుస్తక ప్రచురణలు ప్రారంభించాలని నిర్ణయించారు. ముద్రణ మద్రాసులో లక్ష్మణరావు పర్యవేక్షణలో ఉండగా పుస్తకాలను చందాదారులకు చేర్చడం, వ్యాపార, రవాణా కార్యక్రమాలను రంగారావు హైదరాబాద్ నుండి స్వయంగా చేపట్టారు. కుటుంబ మంతా మద్రాసుకు తరలి వెళ్లి ఆర్నెల్లపాటు అక్కడే నివసిస్తూ గ్రంథ మండలిని అభివృద్ధికి కృషి చేశారు. రావిచెట్టు స్వదేశీ ఉద్యమాన్ని బలపరిచి, స్వదేశంలో తయారైన వస్తువుల ప్రచారానికి దృఢ సంకల్పంతో పనిచేశారు.

లక్ష్మీ నరసమ్మ కూడా విద్యా వికాసానికి, సాంఘిక కార్యక్రమాలతో భర్తతో పాటు పాల్గొనేవారు. స్త్రీ విద్యకై ఇద్దరూ పాటుపడ్డారు. స్త్రీలకు కుట్టు పనులు మొదలయినవి నేర్పించి వారిలో నైపుణ్యాన్ని పెంచాలనీ విద్యాభివృద్ధి చేయూత లక్ష్యంతో 'ఆంధ్రమహిళా సంఘాన్ని స్థాపించి లక్ష్మీనరసమ్మనే దాని మొదటి అధ్యక్షురాలుగా బాధ్యతల్ని చేపట్టారు. ప్రతి శుక్రవారం వారి ఇంట్లోనే స్త్రీ విద్య, శిశుపోషణ, గృహ నిర్వహణ, పాతివ్రత్యము, ఐకమత్యము మొదలయిన అంశాలపై ఉపన్యాస కార్య క్రమాలు నిర్వహించేవారు.

1908 సంవత్సరంలో మూసీనదికి భయంకరమైన వరదలు వచ్చి హైదరాబాదు నగరాన్ని ముంచి వేయగా, ఎంతో ధన, ప్రాణనష్టం



జరిగింది. ఆపద కాలంలో రంగారావు హైదరాబాద్ నగర ప్రజలకు సహాయపడి, నిరాశ్రయులైన వారికి, వసతి సౌకర్యాలు కల్పించారు. వీరు ఎంతోమంది పేద విద్యార్థులను తన ఇంట్లో వుంచుకొని ఉన్నత చదువులు చెప్పించారు. అలా వారి సహాయంతో పైకివచ్చిన వారిలో ఆదిరాజు వీరభద్రరావు లాంటి వారు ఉన్నారు. రావిచెట్టు రంగారావు జీవిత చరిత్రను ఆదిరాజు వీరభద్రరావు 1910 లో 'జీవిత చరితావళి' అనే గ్రంథంలో నిక్షిప్తం చేశారు. ఇది విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి పక్షాన 1911 లో ప్రచురితమైంది. మాతృభాష, గ్రంథాలయాల అభివృద్ధి కోసం, సర్వస్వము ధారపోసిన రంగారావు తన ముప్పై మూడో ఏటనే 1910 జూలై 3వ తేదీన ఆకస్మికంగా కన్నుమూశారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

## ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్




గొల్లపల్లి జూలై 02 (ప్రజామంటలు): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ. డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు. గొల్లపల్లి మండలంలోని గుంజపడుగు గ్రామాన్ని ఆరోగ్య సిబ్బందితో సందర్శించి ఇంటింటి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పరిసరాల పరిశుభ్రత ,నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని లేనిచో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, బోదకాలు టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చును అని, ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే గా పాటించాలని కోరారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ గట్టు శ్రీధర్, సూపర్ వైజర్లు నరేందర్, ద్వారక, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి ఏపీఎం, సి.ఎ. పై జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు

## సంఘాలలో అక్రమాలు జరిగినా స్పందించని ఏపిఎం

## పచ్చునూరి లతా రాజేష్ ఫిర్యాదు



my div
https://www.eprajavani.ts.nic.in/office/printacknowledgement.php?...

Prajavani Acknowledgement Receipt

Name:Pachunuri Latha
Mobile No. : 9490099661
Address:Bheemadevarapally,Bheemadevarapally,Bheemadevarapally
Village:BHEEMADEVARPALLE
Mandal:BHEEMADEVARPALLE
Grievance Subject:FSD

Your Grievance is Registered vide Registration no. WGUDC/E/2024/01287 On 01-07-2024. Please keep the registration number for all future correspondence. Your Grievance is sent to DISTRICT RURAL DEVELOPMENT OFFICER

Thanks for the Registration!

భీమదేవరపల్లి జూలై 02 (ప్రజామంటలు): భీమదేవరపల్లి మహిళా సంఘంలో అక్రమాలకు పాల్పడుతున్న ఏపీఎం, సీఏలు చేస్తున్న అవినీతి అక్రమాలపై విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పచ్చునూరి లతా రాజేష్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దంపతులు ఇద్దరు మీడియా మాట్లాడుతూ. స్థానికంగా ఉండే మహిళలకు మహిళా సంఘంలో అవకాశం కల్పించకుండా, ఊరితో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి, ఊర్లో ఉన్న వాళ్ళని కాదని, బంధుప్రీతితో మహిళా సంఘ గ్రూపులలో కొనసాగిస్తున్నారని అన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలని, మహిళా సంఘంలో జరుగుతున్న అవకతవకలని ఏరి వేయాలని అన్నారు. సి ఏ తమను బూతు మాటలు మాట్లాడుతూ, మానసికంగా అవమాన పరుస్తున్నారని ఆరోపించారు. ఏపీఎం, సీఏ, లీడర్ ముగ్గురు కుమ్మక్కై నానా ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. మండల కేంద్రంలోని మహిళా సంఘాల అవినీతిని అరికట్టి తగిన న్యాయం చేకూర్చాలని కలెక్టర్ కు విన్నవించారు.

## జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి మృతి



ఇబ్రహీంపట్నం జూలై 02 (ప్రజామంటలు): మండల పరిధిలోని గోదూరు గ్రామానికి చెందిన నల్ల లక్ష్మి (భర్త: సంజీవరెడ్డి, 54 సంవత్సరాలు కులం గుడెటి కాపు గ్రామము గోధూర్) అనునామె తన భర్త అయిన నల్ల సంజీవరెడ్డి గత రెండు సంవత్సరాల క్రితం ఆత్మహత్య చేసుకోగా అప్పటినుండి లక్ష్మి మానసిక వేదనకు గురై ఎవరితోనూ మాట్లాడేది కాదు. తన భర్త గురించి ఆలోచిస్తూ ఎప్పుడూ బాధపడుతూ ఉండేది, శనివారం తేదీ 29-6-2024 రోజున తన కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్ళగా, ఇంట్లో ఎవరు లేని సమయంలో జీవితంపై విరక్తి చెంది నల్ల లక్ష్మి ఏదో గుర్తుతెలియని పురుగుల మందు తాగి వాంతికి చేసుకుంటుండగా అది గమనించిన నల్ల రాజశేఖర్ రెడ్డి వెంటనే మెట్ పల్లిలోని గవర్నమెంట్ హాస్పిటల్ కు తరలించగా అక్కడ డాక్టర్ చూసి పరిస్థితి విషమంగా ఉందని నిజామాబాదు హాస్పిటల్ కు తీసుకువెళ్ళమనగా నిజామాబాద్ లోని హోప్ హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం తేదీ 1-07-2024 న రాత్రి అందాద 9:30 గంటల సమయంలో చనిపోయిందని డాక్టర్ తెలిపినారని మృతురాలి కొడుకు నల్ల రాజశేఖర్ రెడ్డి దరఖాస్తు ఇవ్వగా ఇబ్రహీంపట్నం ఎస్సై ఏ అనిల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

## వైయస్ షర్మిల ను కలిసిన దేశిని కోటి...!



జమ్మికుంట జూలై 02 (ప్రజామంటలు): ఏపీ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చిన షర్మిలను అక్కడే ఉన్నా ఇల్లందకుంట దేవస్థాన మాజీ చైర్మన్ దేశిని కోటి, టిపిసిసి ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ ఇద్దరూ షర్మిలను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం తో సన్మానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ క్యాడర్ను రక్షించాలని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి రాజన్న రాజ్యం స్థాపించాలని రాజన్న బిడ్డను వైయస్ షర్మిల ను వేడుకున్నారు.

# నిరుపేదల దేవుడు ఉదయ్ నందన్ రెడ్డి

## 220 మంది విద్యార్థులకు స్కాలర్షిప్ పంపిణీ



జమ్మికుంట జూలై 02 (ప్రజామంటలు): చదువు ద్వారానే సమాజంలో మంచి మార్పు వస్తుందని, పేదరికానికి పరిష్కారం చదువు ఒక్కటే అని గ్రహించిన నిరుపేదల దేవుడు పాడి ఉదయానందన్ రెడ్డి తన స్వగ్రామం వీణవంక గ్రామంలో 220 అనాథ మరియు నిరుపేద విద్యార్థులకు నెలకి వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందించే దానిలో భాగంగా రెండు నెలల స్కాలర్షిప్లను తన సిబ్బంది ద్వారా మొత్తం 2000ఐ220 = 4,40,000 రూపాయల స్కాలర్షిప్ లను విద్యార్థులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. విద్యార్థుల యొక్క ఉన్నత భవిష్యత్తు కోసం మంచి నాణ్యమైన విద్యను వీణవంక గ్రామంలోని విద్యార్థులకి అందించాలని గొప్ప లక్ష్యంతో ప్రతి నెల విద్యార్థులకు స్కాలర్షిప్లు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో స్కాలర్షిప్స్ విభాగం వీణవంక మండల్ బ్రైట్ లైఫ్ కో-ఆర్డినేటర్ తాళ్లపెల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య, వైద్యం, ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించడమే నా ఎజెండా

## దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు




వేలేరు జూలై 02 (ప్రజామంటలు): మండలానికి చెందిన 46 మంది కల్యాణ లక్ష్మి, ఇద్దరు ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.వేలేరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలేరు మండలానికి చెందిన 46మంది లబ్ధిదారులకు 46 లక్షల 05 వేల 336 రూపాయల విలువ గల చెక్కులను అలాగే ఇద్దరు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 53 వేల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. అనంతరం మండల సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పదవి కాలం ముగుస్తున్న ఎంపిటిసిలను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.... దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేస్తుందని అన్నారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా కొత్త పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు వేలేరు మండలానికి 9కోట్ల 16 లక్షల రూపాయలను ఆడపిల్లల పెళ్లిళ్లు చేసిన తల్లిదండ్రులకు అందజేసినట్లు తెలిపారు. త్వరలోనే ఆడపిల్ల పెళ్లిళ్లకు మంగళసూత్రం కూడా అందించనున్నట్లు వెల్లడించారు. వేలేరు మండలంలో ప్రధానంగా రెండు మూడు సమస్యలు ఉన్నాయని అన్నారు. వేలేరు మండలం చాలా ఎత్తైన ప్రాంతంలో ఉందని, మండలానికి 104 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు అయిందని, త్వరలోనే పనులు ప్రారంభించి 9నెలలో పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికీ మండలంలోని ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించే బాధ్యత నేను తీసుకుంటానని హామీ ఇచ్చారు. వేలేరు మండలం కొత్తగా ఏర్పడిన మండలమని, మండలంలో త్వరలోనే నిధులు మంజూరు చేయించి మండల సమీకృత కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టానున్నట్లు వివరించారు. వేలేరు నుండి పిచర, మద్దెలగూడెం మీదుగా శాలపల్లి వరకు గల రోడ్డు అద్వానంగా ఉందని ఈ రోడ్డును త్వరలోనే డబుల్ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా తరిగొప్పుల వరకు గల ఆర్ అండ్ బీ రోడ్డు ను కూడా త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యా, పేద ప్రజలకు మరుగైన వైద్యం, ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించాలనే లక్ష్యం ముందుకు వెళ్తున్నానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విచిత్ర రీతిలో నిరసన వ్యక్తం చేసిన జమ్మికుంట జడ్పీటీసి

## రెండో విడత దళిత బంధు నిధులు విడుదల చేయాలని నిరసన



జమ్మికుంట జూలై 02 (ప్రజామంటలు): కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది ఈ టర్మ్ లో చిట్ట చివరి సమావేశం కావడంతో పెండింగ్ లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జమ్మికుంట జడ్పీటిసి సభ్యులు డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ నిరసన వ్యక్తం చేసేందుకు ప్రయత్నించాడు. దీనిలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గం లో ఉప ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం తలపెట్టిన దళిత బంధు కార్యక్రమం పెండింగ్ లో ఉన్న దళిత బంధు నిధులు విడుదల చేయాలని కోరుతూ నినాదాలతో కూడిన టీ షర్టును ధరించి జెడ్పి సమావేశంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది ఈ టీ షర్టు రావద్దని అడ్డుకున్నారు. దీంతో అసహనం చెందిన జడ్పిటిసి సభ్యుడు చట్టసభల్లో సైతం ఎమ్మెల్యేలు ఎంపీలు నిరసన వ్యక్తం చేసే విచిత్ర వేశాధారణ వేసుకోవడం జరుగుతుందని అక్కడ లేని అడ్డంకులు ఇక్కడ ఎందుకు అని ప్రశ్నించాడు. ఏది ఏమైనా దళిత బంధు రెండో విడత నిధులు ఫ్రీజింగ్ లో ఉన్నటువంటి అకౌంట్లను రిలీజ్ చేసి దళితులను ఆదుకోవాలని వేడుకున్నారు.

## ప్రతి మంగళవారం ప్రజా సమస్యలు నేరుగా ప్రజాదర్బార్ లో ఫిర్యాదు చేయవచ్చు

జగిత్యాల జూలై 02 (ప్రజామంటలు): ప్రతి మంగళవారం జగిత్యాల పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని ప్రజా సమస్యలపై పిర్యాదు చేయ వచ్చని చైర్పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం ప్రజా సమస్యల కోసం దర్బార్ నిర్వహించారు. జగిత్యాల పట్టణంలో ప్రతి సమస్యకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కార మార్గం చూపాలని జగిత్యాల పట్టణంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రతి మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుందని పట్టణ ప్రజలు మీ వార్డులో మురుగునీరు, చెత్త డ్రైనేజీ ఏ సమస్య ఉన్న ప్రజాదర్బార్లో నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని దానికి పరిష్కారం సంబంధిత అధికారులతో కలిసి సమస్య పరిష్కరించే దిశగా మేమందరం కృషి చేస్తామని జగిత్యాల పట్టణ ప్రజల ఆరోగ్యం అభివృద్ధి కొరకు మీరు మాతో కలిసి నడవాలని కోరుకుంటున్నాం అని జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.






# అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

మెట్ పల్లి జులై 02 (ప్రజామంటలు): మెట్ పల్లి-4 అనే అంగన్ వాడి కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధ్బంగా అంగన్వాడి కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. భోజన నమోదులు, టైం టేబుల్, భోజన మెనూ, ఫుడ్, స్టాక్, అంతేకాకుండా అంగన్ వాడి లో ఇచ్చే గుడ్ల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రి స్కూల్ పిల్లల హాజరు, గర్భిణిలు, బాలింతల హాజరు నమోదులు, ఎంహెచ్ టిఎస్ మొబైల్ యాప్ లో పరిశీలించారు. అంతే కాకుండా అంగన్వాడి కేంద్రములో ఉన్న పిల్లల, ఎత్తుల, బరువులు స్వయంగా పరిశీలించారు. ఎన్ హెచ్ టిఎస్ మొబైల్ యాప్ లో, లోప పోషణ ఉన్న పిల్లలు ఎవరు ఉన్నారో యాప్ లో చెక్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్ వాడి కేంద్రాల్లో పిల్లల పెరుగుదల పర్యవేక్షణ నివేదికల గురించి అడిగారు. పిల్లల పెరుగుదల పర్యవేక్షణ ను క్రమంగా చేపట్టి ఖచ్చితమైన పిల్లల ఎత్తులు, బరువులు నమోదు చేయాలని సర్వే లోని తేడాలు ఉండరాదని అంగన్ వాడి టీచర్లను ఆదేశించారు. గ్రామాలలో గ్రామ పంచాయితి సిబ్బంది అంగన్ వాడి కేంద్రాలను పర్యవేక్షణా చేపట్టి ప్రి స్కూల్ పిల్లల విద్య, పెరుగుదల పర్యవేక్షణ చేపట్టి ఖచ్చితమైన నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జిల్లా సంక్షేమ అధికారి వాణి శ్రీ, ఆర్డిఓ, మున్సిపల్ కమిషనర్, ఎంఆర్ఓ, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ మధు కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ లు వచ్చేలా చూడాలని

### ఎమ్మెల్యేని కోరిన ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ సభ్యులు



జగిత్యాల జులై 01 (ప్రజామంటలు): ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను కలిసిన జగిత్యాల జిల్లా ప్రైవేట్ డిగ్రీ,పీజీ కళాశాల అసోసియేషన్ సభ్యులు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా 2021-22, 2022-23 2023-24 మాకు ఇవ్వ వలసిన ఫీజు రియంబర్స్ మెంట్ మొత్తాలను విడుదల చేయక పోవడం వల్ల మాకు కళాశాల నిర్వహణ భారంగా మారినది అని, కావున మా ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మా నియోజక వర్గం ప్రతినిధిగా ప్రభుత్వం ద్రుష్టి కి మా సమస్యను తీసుకువెళ్లి నిధులు విడుదల చేయాగలరని వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లు నరేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అపర ఏకాదశి ఉత్సవం



కరీంనగర్ జులై 02 (ప్రజామంటలు): తిరుమల్ నగర్ లోని మయూరగిరి పీఠం శ్రీ నిలయంలో జ్యేష్ట బహుళ అపర ఏకాదశి ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు నమిల కొండ రమణాచారి స్వామి వారి ఆధ్వర్యంలో ఉదయం నుండి నారాయణమూర్తికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణ హోమం శ్రీ సూక్త హోమం, హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాలు అత్యంత వైభవంగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భగవంతుని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. లోకమంతా సుభిక్షంగా ఉండాలని లోక కళ్యాణార్థం ఈ ఏకాదశి వ్రతాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు శ్రీరామ సేవా తరంగి ట్రస్ట్ సభ్యులు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాచార్యులు, గీతాచార్యులు రమేష్ స్వామి మొదలగు పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## వృద్ధులకు, వికలాంగులకు ఉచిత సేవ ప్రారంభం



గొల్లపల్లి జులై 02 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో బాధినేని మల్లారెడ్డి సేవా దృక్పదంతో లక్ష్మీపూర్ పరిసర ప్రాంత వృద్ధులు, వికలాంగులు గర్భిణీ స్త్రీల ఆరోగ్య అవసరాల నిమిత్తం హాస్పటల్ వెళ్ళటానికి లక్ష్మీపూర్ నుండి జగిత్యాలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం ఒక వాహనాన్ని ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందుల లావణ్య జలపతి, కట్ట శివ, మల్లారెడ్డి, రాజిరెడ్డి, అసినేని లక్ష్మణ్, బ్లజపెల్లి శంకరయ్య, తిరుపతి, మంద పెల్లి లక్ష్మణ్, ఎనగందుల మల్లయ్య, లచ్చన్న, సతీష్, శేఖర్, రంగ మల్లేశం గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రితో పార్టీలో చేరాను

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల జులై 02 (ప్రజామంటలు): జగిత్యాల ప్రాంత అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రితో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ ఆదేశం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరటం జరిగిందన్నారు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డీ రైతు పక్షపాతి. ముఖ్యమంత్రి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. ఆరు గ్యారంటీ లు అమలు చేస్తారు అని నమ్మకం ఉంది. మరియు ప్రజల పక్షపాతి. ముఖ్యమంత్రి, మంత్రులు, సహచరులు అందరి సహకారం ఉంది. జగిత్యాల పట్టణంలో ఎక్కడా లేని విధంగా 4500 డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం. డబల్ బెడ్ రూం ఇండ్లకు మౌలిక సదుపాయాలు కల్పించడం లో కొంత ఆలస్యం అయ్యింది. ముఖ్యమంత్రి, మంత్రులు సహకారంతో డబల్ బెడ్ రూం ఇండ్ల కు 32 కోట్ల 16 లక్షల నిధుల మంజూరుకు జీవో తీసుకురావడం జరిగిందని అన్నారు. 20 వేల మంది బీద మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. తనది రాజకీయ కుటుంబమన్నారు. మా కుటుంబంలో మాకునూరి శ్రీరంగ రావు, మాజీ మంత్రి చొక్కారావు మా కుటుంబ సభ్యులు. మంత్రులు, ఎమ్మెల్యే లుగా కొనసాగారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే టిడిపి కి ఎల్. రమణ కు మద్దతు ఇవ్వడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ అధికారంలో ఉంటే బిఆర్ఎస్ పక్షాన పోటీ చేయటం జరిగిందన్నారు. నేను పోటీ చేసే నాటికి బి ఆర్ ఎస్ లో ఎంపీటీసీ, జెడ్ పిటిసి లు, కౌన్సిలర్ ఎన్నికలకు పోటీ చేయడానికి అభ్యర్థుల కూడా లేరు. మాజీ ఎంపీ కవిత సహకారంతో రాజకీయాలలోకి రావడం జరిగిందని స్పష్టం చేసారు. డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం ముగ్గురు గుత్తేదారులు వచ్చి వెళ్ళిపోతే దగ్గరి వ్యక్తి ని తీసుకువచ్చి పేద మధ్య తరగతి ప్రజల కోసం వాటిని పూర్తి చేయటం జరిగిందని తెలిపారు. ప్రజా స్వామ్యంలో అధికార పక్ష పార్టీతో పని చేయటం వల్ల నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయటం సాధ్యం అవుతుందని పేర్కొన్నారు.

**బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ విమర్శ వారి విజ్ఞతకే వదిలేస్తాం**



కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన వారినీ గతంలో బి అర్ ఎస్ పార్టీ లోకి ఆహ్వానించ లేధా అని వారిని సూటిగా ప్రశ్నించారు. బిఆర్ఎస్ వేదిక పై నన్ను విమర్శించిన ప్రతి ఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. నాపై చేసిన తప్పుడు ఆరోపణలు ఖండిస్తున్నా అన్నారు. నా ఆర్థిక పరిస్తితి గురించి నాకు భయం లేదు. నా ఆర్థిక పరిస్తితి ప్రజలందరికీ తెలుసునన్నారు. సేవా భావం తోనే రాజకీయాలకు వచ్చానన్నారు. జగిత్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ లో చేరటం జరిగిందన్నారు.



# విమర్శలు మాని ఆత్మ విమర్శ చేసుకోవాలి కేటీఆర్ కు అడ్లూరి సలహా

## రామ కిష్టయ్య సంగన భట్ల

ధర్మపురి జులై 02 (ప్రజామంటలు):

అధికార కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు చేయడం మాని, ప్రస్తుత బి ఆర్ ఎస్ పరిస్థితి పై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆత్మ విమర్శ చేసుకోవాలని, ప్రభుత్వ విప్, జగిత్యాల డిసిసి అధ్యక్షుడు, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సలహా ఇచ్చారు. మంగళవారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. జగిత్యాల జరిగిన బిఆర్ఎస్ పార్టీకి సంబంధించిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపైన కాంగ్రెస్ పార్టీ పైన కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దేవుడు నోరు ఇచ్చాడు కదా అని ఇష్టానుసారంగా మాట్లాడితే కుదరదని, ఒళ్ళు, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హితవు పలికారు. తాము ఎవ్వరినీ పార్టీలు మారమని ప్రోత్స హించలేదని, వారే వచ్చి స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని స్పష్టం చేశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు ఇచ్చిన హామీలలో ఎన్నింటినీ అమలు చేశారో కేటీఆర్ చేప్పాలని డిమాండ్ చేశారు. వారు హామీలను అమలు చేసినట్లయితే ఎన్నికల్లో ఓట్లు ఎందుకు తక్కువ వచ్చాయో తెలుసుకోవాలన్నారు. దళిత సిఎం,దళితులకు 3 ఎకరాల భూమి,కేజీ టు పీజీ విద్య, రుణమాఫీ వంటి హామీలు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఉద్యమంలో సింహ భాగం పాలు పంచుకున్న నిరుద్యోగ యువత ను ఉపాధి కల్పించక వంచించారన్నారు. 10 సంవత్సరాల పాటు రాజ్యమేలి ఒక రాచరిక పాలన అందించి అన్ని నేనే అన్న విధంగా పరిపాలన కొనసాగించిన కేసీఆర్ కి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. తాము తెలంగాణ ప్రజ లకు తమ పార్టీ ఇచ్చిన హామీలలో 4గ్యారంటీ లు వెంటనే అమలు చేశామని, అందుకే 8 ఎంపీ సీట్లు గెలిచా మన్నారు. ఆగష్టు 15 లోగా రైతు ఋణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిం చారని గుర్తు చేశారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి సంక్షేమ పథకాలు కూడా అమలు చేసి తీరుతామన్నారు. గత ప్రభుత్వంలో సిఎం నీ కలిసే అవకాశం ఎవరికైనా ఉందా,కానీ ఇప్పుడు ఎవ్వరైనా ము ఖ్యమంత్రిని కలిసి వారి సమస్యలు విన్నవించు కొనే స్వేచ్ఛ ఉందన్నారు. తెలంగాణ ప్రజలు తలవంచుకునే విధంగా కేసిఆర్ కుమార్తె కవిత లిక్కర్ కేసులో జైల్లో ఉన్నారని, కేటీఆర్ కాబో యే సిఎం అని ప్రచారం చేసిన బి.ఆర్.ఎస్ నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్ర శ్నించారు. కొప్పుల ఈశ్వర్, ఆయన సతీమణి నాయకత్వం లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాల ద్వారా ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో శ్వేత పత్రాన్ని విడుదల చేయాలన్నారు. కేసిఆర్ గతంలో వివిధ సందర్భాలలో మాట్లాడిన పరస్పర విరుద్ధమైన మాటలను ఫోన్ ద్వారా వీడియో ప్రదర్శన గావించారు. పిసిసి సభ్యులు దినేష్, నాయకులు వేముల రాజేశ్, జక్కు రవీందర్, ప్రసాద్, సముఖ్, లక్ష్మణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రిడిటేషన్ కమిటీలో ఎఐఎంఎ కు స్థానం కల్పించండి

**మా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి**

**కరీంనగర్ అదనపు కలెక్టర్ కు ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ విజ్ఞప్తి**

కరీంనగర్ / జగిత్యాల జులై 02 (ప్రజామంటలు):

ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చుక్క గంగారెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లో అదనపు జిల్లా కలెక్టర్ లక్ష్మి కిరణ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులకు జారీ జేసే అక్రిడిటేషన్ సెలక్షన్ కమిటీ లో ఆల్ ఇండియా మీడియా అసోసియేషన్ కు కూడా స్థానం కల్పించి సభ్యులుగా చేర్చుకోవాలని కోరారు. తమ సంఘం ద్వారా వచ్చే విజ్ఞప్తులను కూడా పరిగణనలోకి తీసుకొని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం, సంక్షేమం కోసం కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం కరీం నగర్ డిపిఆర్వో వీరాంజనేయులు ను కూడా కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. పలు అంశాలపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎంఎ నాయకులు చౌటపల్లి తిరుపతి, ఖాజా సల్మాన్, కె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆమరణ దీక్ష విరమించిన మోతీలాల్ నాయక్

**రేపటి నుంచి ప్రభుత్వంపై పోరాటం**

**ఆరోగ్యం సహకరించలేకనే దీక్ష విరమణ**

సికింద్రాబాద్ జూలై 02 (ప్రజామంటలు):



గ్రూప్స్, నిరుద్యోగుల డిమాండ్ల సాధనకు గాను గత తొమ్మిది రోజులుగా గాంధీ ఆసుపత్రిలో ఆమరణ దీక్ష చేస్తున్న ఓయూ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ మంగళవారం ఉదయం గాంధీలో తన దీక్షను విరమించారు. తాను తొమ్మిది రోజులుగా ఎలాంటి ఆహారం తీసుకోకుండా, కఠిన ఆమరణ దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పాటు తన ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆమరణ దీక్ష విరమించాల్సి వచ్చిందని చెప్పారు. గాంధీ ఆసుపత్రి ఆవరణలోని ప్రొ. జయశంకర్ విగ్రహం వద్ద నాయక్ స్వయంగా కొబ్బరి నీళ్ళు తాగి తన దీక్ష ను విరమించారు. తనకు మద్దతు ఇచ్చిన పెద్దలకు గౌరవించడానికే ఏ ఒక్కరి చేత్తో కాకుండా, తనే స్వయంగా కొబ్బరి నీళ్ళు తాగి దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. గాంధీ ఆవరణలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీగా పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈసందర్భంగా మోతీలాల్ నాయక్ మీడియాతో మాట్లాడుతూ.... ఎన్నికల్లో నిరుద్యోగులకు హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీరా గెలిచాక తమను పట్టించుకోవడం మానేశారని చెప్పారు. తాను ఎలాంటి ప్రలోభాలకు లొంగలేదని చెబుతూ తన తల్లిపై ప్రమాణం చేశాడు. తన ఆరోగ్యం బాగా క్షీణిస్తుందన్న డాక్టర్ల సూచనతో దీక్ష విరమించానని, చనిపోతే సమస్య పరిష్కారం కాదని, అందుకే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, లక్షలాది మంది నిరుద్యోగులకు న్యాయం చేసేలా ప్రభుత్వంపై రేపటి నుంచి ఒత్తడి తెస్తామన్నారు. ఇందుకు గాను అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, నిరుద్యోగ జేఏసీలతో సమిష్టిగా చర్చించి, ఐక్య కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రాజారావు, చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, సీ.ఐ. అనుదీప్, ఎస్.ఐ. లు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

గొల్లపల్లి జులై 02 (ప్రజామంటలు):



గొల్లపెల్లి మండల కేంద్రంలో మంగళవారం గొల్లపల్లి రైతు వేదిక లో రైతులకు రైతు నేస్తం కార్యక్రమం (వీడియో కాన్ఫరెన్స్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు ఎం. మల్లికార్జున్ రెడ్డి సమగ్ర వ్యవసాయ పద్ధతులు గురించి నేరుగా విత్తన వరి సాగు పద్ధతులు గురించి తన అనుభవాలను తోటి రైతులతో పాలుపంచుకున్నారు. శాస్త్రవేత్త డాక్టర్, గోవర్ధన్ సమగ్ర వ్యవసాయ పద్ధతులు గురించి రైతులకు వివరించారు. రైతులకు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఏడిఏ, సిహెచ్ రామచంద్రం, గొల్లపెల్లి మండల వ్యసాయాధికారి కరుణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# నిరుద్యోగుల సమస్యలపై ఎం.ఆర్.ఓ. కు వినతి పత్రం ఇచ్చిన బీజేవైఎం నాయకులు

మహాదేవపూర్ జూలై 02 (ప్రజామంటలు):

బీజేవైఎం రాష్ట్ర శాఖ పిలువు మేరకు అన్ని మండల తహసీల్దార్ ఆఫీస్ లలో వినతి పత్రాలు ఇవ్వాలనే ఆదేశాల మేరకు అందులో భాగంగా మహాదేవపూర్ మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మహాదేవపూర్ తహసీల్దార్ రాథోడ్ ప్రహలాద్ కు వినతి పత్రం ఇచ్చారు. బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్ మాట్లాడుతూ.... నీళ్ళు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటి వరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారనేది జగమెరిగిన సత్యం గత బి.ఆర్.ఎస్. ప్రభుత్వం నిరుద్యోగులకు మొండి చెయ్యి చూపించినట్లుగానే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తూ హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తుంది అని అన్నారు. కావున ఎం.ఆర్.ఓ. ని ఈ నిరుద్యోగ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళమని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు రాంశెట్టి మనోజ్, కార్యదర్శులు బల్ల సంపత్, శ్యామల ప్రశాంత్, వెంకటేష్, పూర్ణచందర్, బీజేపీ నాయకులు మంథని రాజేందర్, అంకరి రాజేందర్ లు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధిలో జెడ్పి చైర్మన్ ల పాత్ర కీలకం

హైదరాబాద్ జులై 02 (ప్రజామంటలు):





జెడ్పి చైర్ పర్సన్ ల ఆత్మీయ సత్కారంలో గ్రామాల అభివృద్ధిలో జెడ్పి చైర్మన్ ల పాత్ర కీలకం అని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ని సన్మానించిన బిఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్. కుటుంబ సమేతంగా కేసీఆర్, కేటీఆర్ లను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు జగిత్యాల జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్. మంగళవారం బిఆర్ఎస్ అధినేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం జెడ్పీ చైర్మన్ ల ఆత్మీయ సత్కారం కార్యక్రమంలో ఐదేళ్ల పదవి కాలం పూర్తి చేయబోతున్న జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆదర్శంగా నిలిచిన ప్రభంజన యూత్ సభ్యులు

రాయికల్ జులై 02 (ప్రజామంటలు):



రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణలోని ఒకవైపు నీరు నిండి ఉన్నది నీరు నిలవడం వల్ల దోమల ఉధృతి ఎక్కువై విష జ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలుసుకున్న ప్రభంజన యూత్ సభ్యులు మరియు పూర్వ విద్యార్థులు ఇప్పుడు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా తమ వంతు విరాళంగా 5000 రూపాయలను ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.... పాఠశాలకు సహాయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. విరాళం దాతలను పలువురు నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా 8, 9, 10 తరగతులకు పర్మిషన్ లేదు

**పాఠ్య పుస్తకాల అక్రమ దందా ,శ్రీ చైతన్య పాఠశాల సీజ్**

**అధిక ఫీజులపై విద్యాశాఖ అధికారులు యజమాన్యానికి నోటీసులు**

ఎల్కతుర్తి జులై 02 (ప్రజామంటలు):





అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఇంద్రనగర్ గ్రామంలో శ్రీ చైతన్య ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల ముందు ధర్నానిర్వహించడం జరిగింది. ధర్నా నిర్వహిస్తున్న సమయంలో డీఈవో కి సమాచారం ఇవ్వడంతో మండల విద్యాధికారి ఎంఈఓ రవీందర్ ని పాఠశాలకు పంపడం జరిగింది విద్యాశాఖ అధికారుల సమక్షంలో శ్రీ చైతన్య పాఠశాలను తనిఖీలు చేయగా 8, 9, 10. పర్మిషన్ లేదని తేలడంతో పర్మిషన్ లేకుండా అక్రమంగా పాఠశాలను నిర్వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండల విద్యాధికారి రవీందర్ కి వినతిపత్రం ఇవ్వడంతో జిల్లా విద్యాధికారి (డిఈఓ) ఆదేశాలతో విద్యార్థి సంఘ నాయకుల సమక్షంలో శ్రీ చైతన్య పాఠశాలను 8, 9, 10 .తరగతులకు ప్రభుత్వ అనుమతి లేనందున సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఊట్కూరి ప్రణీత్ గౌడ్ భాష బోయిన సంతోష్ మాట్లాడుతూ... శ్రీ చైతన్య ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల గత నాలుగు సంవత్సరాల నుండి 8, 9, 10. తరగతులకు ప్రభుత్వ అనుమతి లేకుండా నడిపిస్తున్నారని పర్మిషన్ లేకుండా విద్యార్థులు చదువుకొని బయటకు వెళ్లి హైయర్ ఎడ్యుకేషన్ చదువుకొని ఏదైనా ఉద్యోగం వచ్చిన సందర్భంలో పర్మిషన్ లేని పాఠశాలలో చదువుకున్నందుకు భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలు బలవుతాయని పాఠ్యపుస్తకాల సైతం షూ, టై, బెల్ట్, యూనిఫార్మ్, స్టేషనరీ, ఇట్లాంటివి అమ్మడమే కాకుండా పాఠ్యపుస్తకాలను పాఠశాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముల్కనూరు గ్రామంలో శ్రీ చైతన్య పాఠశాల ఎంప్లాయి ఇంట్లో ఎట్లాంటి అనుమతులు లేకుండా ఇదేచ్ఛగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని దాంతోపాటు పాఠశాలకు కనీసం ఫైర్, పొల్యూషన్ ,క్వాలిఫై టీచర్స్, బస్సుల ఫిట్నెస్, ఉన్న పరిస్థితి లేదని ఉన్న బస్సులలో సైతం అధిక సంఖ్యలో విద్యార్థులు ఎక్కించి నడుపుతున్నారని జిల్లా వ్యాప్తంగా ఉన్న శ్రీ చైతన్య ఇతర ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై దృష్టి సారించడంలో విద్యాశాఖ విఫలమైందని ఇప్పటికైనా స్పందించి జిల్లావ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలను సీజ్ చేయాలని పాఠ్యపుస్తకాల దందాను సైతం బంధు చేయాలని లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, జిల్లా నయకులు ఎస్. మనోజ్, వి. నరేష్, ఎం. సందీప్, ఎం. కళ్యాణ్, యు. వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎస్ఆర్టీసీలో 3035 కొలువులు

## - భర్తీకి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం- మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం

## - కొత్త రక్తంతో ఆర్టీసీని మరింతగా బలోపేతం చేస్తామని వెల్లడి

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ)లో ఖాళీగా ఉన్న 3035 పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిన అన్ని పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ 3035 పోస్టుల్లో 2000 డ్రైవర్, 743 శ్రామిక్, 114 డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానిక్), 84 డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 11 సెక్షన్ ఆఫీసర్(సివిల్), 7 మెడికల్ ఆఫీసర్(జనరల్), 7 మెడికల్ ఆఫీసర్(స్పెషాలిస్ట్) కొలువులు ఉన్నాయి.ఆర్టీసీలో వివిధ కేటగిరిల్లో 3035 పోస్టులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క గారికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు టీజీఎస్ఆర్టీసీలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని, ప్రజా రవాణా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ తమ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేస్తోందని అన్నారు. ఈ కొత్త రక్తంతో రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా బలోపేతం చేస్తామని చెప్పారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బస్సులను సంస్థ కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఈ కొత్త బస్సులకు అనుగుణంగా నియమకాలు చేపడుతున్నట్లు వివరించారు. వీలైనంత త్వరగా 3035 పోస్టులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

# తెలంగాణకు నీటి సమస్యకు పరిష్కారం కాళేశ్వరమే

### - దీనిని ఎండబెడితే తెర్లు అయ్యేది తెలంగాణే: కెటిఆర్

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తలాపున గోదారి గలగల పారుతున్నా తనువంతా ఎడారై ఎండిన శాపానికి విమోచన కాళేశ్వరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ కరువులకు కన్నీళ్లకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం ప్రాజెక్టు అని చెప్పారు. తెలంగాణ తెర్లైపోతే సంకలు గుద్దుకుందా మని చూసిన వంకరబుద్ధిగాళ్లకు ఈర్ష్య అసూయ పుట్టించి.. కన్నుకుట్టించిన మా వరప్రదాయిని అన్నారు. సముద్ర మట్టానికి ఎత్తున ఉన్న మా చేను చెలకలు నదీ జలాలతో తడవాలంటే ఎత్తిపోతలే శరణ్యమని తెలిపారు. దగాపడ్డ నేల దశాబ్దాలుగా జరిపిన గోదారి జలాల సాధన పోరాటాలకు సమాధానం కాళేశ్వరమంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మా కరువులకు కన్నీళ్లకు శాశ్వత పరిష్కారం కాళేశ్వరం.!. మా వరప్రదాయిని కాళేశ్వరం!. తలాపున గోదారి గలగల పారుతున్న తనువంతా ఎడారై ఎండిన శాపానికి విమోచనం కాళేశ్వరం! దశాబ్దాలుగా జరిపిన గోదారి జలాల సాధన పోరాటాలకు సమాధానం కాళేశ్వరం!. శిథిల శివాలయంగా పాడుబడిపోయిన శ్రీరామ్ సాగర్‌కు పునరుజ్జీవమిచ్చిన పుణ్య వరం కాళేశ్వరం!. నీళ్లురాక.. ఒట్టిపోయిన నిజాంసాగర్‌కు నిండుకుండలా మార్చే అండ దండ కాళేశ్వరం!. మండుటెండల్లో చెరువులను మత్తళ్లు దూకించిన మహత్యం కాళేశ్వరం.మా తపనకు, ఆలోచనకు, అన్వేషణకు, జలదౌత్యానికి నిదర్శనం కాళేశ్వరం. కాళేశ్వరం అంటే ఒక్క బరాజ్ కాదని తెలియని మీ అజ్ఞానం. ఎక్కడో ఒక లోపం తలెత్తడం సహజం సరిదిద్దుకోగలం. రాజకీయ కుళ్లు కుతంత్రాలను దిష్టి చూపులను తట్టుకోగలం. మీ ఏడుపే మా ఎదుగుదల' అంటూ పోస్ట్ చేశారు.

# ఎన్‌డిఎ ఎంపిలకు ప్రధాని మోడీ దిశానిర్దేశం

## పార్లమెంటులో అప్రమత్తంగా ఉండాలని సూచన

న్యూఢిల్లీ,జూలై2(ప్రజా మంటలు):

పార్లమెంట్‌లో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల ఎంపీల సమావేశంలో ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎంపిలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశానికి ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. సమావేశానికి ఎన్డీఎ భాగస్వామ్య పక్ష పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఎన్డీఎ భాగస్వామ్య పక్షాల ఎంపీలను ఉద్దేశించి ప్రధాని ప్రసంగించారు. సోమవారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే అంశంపై చర్చించే క్రమంలో వారిని అప్రమత్తం చేశారు. సభలో సంయమనం పాటించాలని సూచించినట్లు తెలుస్తోంది. అలాగే ప్రతి అంశంపైనా సమగ్రంగా సాధికరతతో మాట్లాడాలని సూచించినట్లు తెలుస్తోంది. ఇకపోతే లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇవ్వనున్నారు. ఇందులో రాహుల్, ఇతర నేతల ప్రసంగాలకు మోడీ సమాధానం ఇవ్వనున్నారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో బీజేపీని ఏకి పారేశారు. అసలు బీజేపీ వాళ్లు హిందువులే కాదని... భయాన్ని, విద్వేషాన్ని, అబద్దాలను వ్యాపింపజేయడం హిందూ ధర్మం కాదని చెప్పారు. హిందువులమని చెప్పుకుంటూ హింస, విద్వేషాలను రెచ్చగొడుతున్నారన్నారు. ప్రధాని మోదీ సహా బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎవరూ హిందువులు కాదన్నారు. సుదీర్ఘంగా 40 నిమిషాల పాటు రాహుల్ ప్రసంగించారు. రాహుల్ వ్యాఖ్యలపై పెను దుమారమే చెలరేగింది. అధికారపక్షం మొత్తం లేచి నిలబడింది. ఏకంగా ప్రధాని మోదీయే రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు యత్నించారు. ఐదుగురు మంత్రులు అడ్డుకున్నా రాహుల్ ప్రసంగ ధాటిని అడ్డుకోలేకపోయారు. ఇదంతా గత పదేళ్లకు భిన్నంగా సాగిన క్రమంగా చూడాలి. విపక్ష హోదాలో రాహుల్ ప్రసంగించే అవకాశం తెచ్చుకున్నారు. గతంలో లాగా బుల్‌డోజ్ వ్యవహారం సాగదు కనుక, విమర్శలరు విమర్శలతోనే తిప్పికొట్టాల్సి ఉంది. ఈ క్రమంలో మోడీ ఎలాంటి సమాధానం సిద్దం చేసుకున్నారన్నది ముఖ్యం.

# బిఆర్ఎస్ లా మోసం చేయకూడదన్న సంకల్పం

### ఉద్యోగాల కల్పన..జాబ్ క్యాలెండర్‌పై కసరత్తు

### శాశ్వత పరిష్కరం కోసం ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ

హైదరాబాద్,జూలై2(ప్రజా మంటలు):

వరుస ఎన్నికలతో కొంత ఆలస్యం అయినా.. తెలంగాణలో నిరుద్యోగులకు శుభవార్త చెప్పే దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలను పకడ్బందీగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని, జాబ్ క్యాలెండర్ విడుదలకు సిద్ధపడుతోంది. గతంలో లాగా తప్పులు జరక్కూడదన్న సంకల్పంతో సాగుతోంది. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా ఉద్యోగాల నియామక విషయంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. నిరుద్యోగులు ఆ ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల్లో నెలకొన్న అసంతృప్తిని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ వారిని సంతృప్తి పరిచేలా హామీలను ఇచ్చింది. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు అడుగులు వేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. లీకేజీలు, పరీక్షల నిర్వహణ లోపాల వల్ల అనేక పరీక్షలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రద్దయ్యాయి. ఈ నేపథ్యంలోనే రేవంత్ సర్కారు నిరుద్యోగుల్లో నెలకొన్న అపనమ్మకాన్ని పోగొట్టేలా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. గడిచిన ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మేరకు టీజీపీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేసి కొత్త పాలక మండలి నియమించింది. పరీక్షల నిర్వహణను యుపిఎస్సి తరహాలో చేపట్టేలా కట్టుదిట్టమైన విధానాలను అనుసరిస్తోంది. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా యుపిఎస్సి చైర్మన్ తోనూ భేటీ అయ్యారు. ప్రభుత్వం కూడా టీజీపీఎస్సీ పరీక్షలపై కోర్టు వివాదాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోంది.

ఇప్పటికే అధికారులు అందించిన ప్రాథమిక నివేదిక ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ దిశగా నిర్ణయం తీసుకోబోతున్నారు. అధికారులు కూడా జాబ్ క్యాలెండర్ కు సంబంధించి తుదిమెరుగులు దిగుతున్నట్లు చెబుతున్నారు. వారం రోజుల్లోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసే అవకాశం ఉందని అధికార వర్గాల నుంచి

సమాచారం అందుతోంది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్సి), తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్, ఇతర నియామక బోర్డులకు సంబంధించిన షెడ్యూల్ తో జాబ్ క్యాలెండర్ విడుదల అయ్యాక అధికారులు ఆ వివరాలను యూపీఎస్సీ, జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ, ఆర్ఆర్బి ఆర్ఆర్సి, బ్యాంకింగ్ వంటి ఇతర పోటీ పరీక్షల బోర్డులకు రాష్ట్రీయ కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు పంపనున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల ఉద్యోగాలకు టీజీపీఎస్సీ షెడ్యూల్ సమయంలో ఇతర పరీక్షల అడ్డంకులను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర జాబ్ క్యాలెండర్ కూడా యూపీఎస్సీ వంటి సంస్థల షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని రూపుదిద్దుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అక్టోబర్ లో గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ ను ప్రకటించారు. గ్రూప్-2 పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న నోటిఫికేషన్లను మినహాయించి పగడ్బందీగా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దుకు హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో చేసిన అప్పీల్ ను ఉపసంహరించుకుంది. పకడ్బందీగా గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించింది. ఇటీవల ప్రాథమిక కీ విడుదల కాగా, త్వరలో ఫలితాలు వెలువాడనున్నాయి. ఉద్యోగాలు నియామకాల విషయంలో గతంలో అడ్డంకిగా ఉన్న రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్ల విషయంలో కోర్టులు పలు తీర్పులను ఇచ్చాయి. ఆయా తీర్పులకు అనుగుణంగా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని అనుసరించింది. దీని ప్రకారమే టీజీపీఎస్సీ మెడికల్ బోర్డు, పోలీస్, గురుకుల బోర్డుల ద్వారా నిర్వహించిన పలు పోస్టులకు సంబంధించి అధికారంలోకి వచ్చిన మొదటి వంద రోజుల్లోనే 28,942 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించింది. టీజీపీఎస్సీ కూడా నియామకాల విషయంలో వేగాన్ని పెంచింది. గతంలో పెండింగ్ లో ఉన్న గ్రూప్-4 ఫలితాలను విడుదల చేసింది. ఈ పోస్టులకు ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పక్రియ కొనసాగుతుంది. 1540 ఏఈ పోస్టులకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తయింది. వ్యవసాయ, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ఎంపికైన జాబితా విడుదలైంది. హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పోస్టుల పరీక్షలు పూర్తవగా, డివిజనల్ అకౌంట్స్ అధికారి (డిఏఓ) పరీక్షలు గత నెల 30 న ప్రారంభయ్యాయి. టెట్ పూర్తి చేసి 11,062 పోస్టులతో డీఎస్సీని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. నిరుద్యోగుల సమస్యలపై ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయానికి సరైన సమాధానం ఇచ్చే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి సర్కార్ వీలైనంత వేగంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. నాలుగైదు రోజుల్లోనే జాబ్ క్యాలెండర్ వెలువడే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్యలపై అధ్యయనం చేసి ఎప్పటికప్పుడు అన్ని విషయాలను తెలుసుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే నిరుద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ నేతలు ఆదేశించారు. గాంధీ ఆసుపత్రిలో విద్యార్థినేత మోతిలాల్ దీక్షపై ఆరా తీసిన ఆయన.. నిరుద్యోగుల విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించినట్లు సమాచారం. నిరుద్యోగుల సమస్యలు, జాబ్ క్యాలెండర్ విడుదల అంశాలపై పార్టీ విద్యార్థి, యువజన నాయకులతో త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు.

# మోదీ ప్రపంచంలో అవన్నీ సాధ్యమే: రాహుల్

న్యూఢిల్లీ,జూలై2(ప్రజా మంటలు):

లోక్‌సభలో తాను చేసిన ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. మోదీ ప్రపంచంలో నిజాలను చెరిపేస్తారు. కానీ వాస్తవ ప్రపంచంలో అది సాధ్యం కాదు. నేను చెప్పాలనుకున్న నిజం చెప్పాను. వారు కావాలంటే అంతా తొలగించుకోని. నిజం ఎప్పటికీ నిజమే అని రాహుల్ స్పష్టం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యే ముందు ఆయన మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా పై విధంగా సామాధనం ఇచ్చారు.

# రాహుల్ వ్యాఖ్యలపై దుమారం

## పలు అంశాలను తొలగిస్తూ స్పీకర్ ఆదేశం

న్యూఢిల్లీ,జూలై2(ప్రజా మంటలు):

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో సోమవారం చేసిన ప్రసంగం తీవ్ర దుమారానికి కారణమైంది. దీంతో స్పీకర్ ఆయన ప్రంగంలోని పలు వ్యాఖ్యలను తొలించాలని ఆదేశించారు. తన ప్రసంగంలో రాహుల్ కేంద్రప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వివిధ మతాలకు సంబంధించిన అంశాలను ఆయన సభలో ప్రస్తావించారు. ముఖ్యంగా ప్రధాని మోదీని టా÷-గ్గ÷ట్ చేస్తూ.. కేంద్రప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మరోవైపు రాహుల్ వ్యాఖ్యలను దేశవ్యాప్తంగా బీజేపీ నేతలు ఖండించారు. హిందువులను అవమానించేలా రాహుల్ మాట్లాడారని ఆరోపించారు. తక్షణమే రాహుల్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రాహుల్ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను బీజేపీ సభ్యులు కోరారు. దీంతో రాహుల్‌పై లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా చర్యలు తీసుకున్నారు. రాహుల్ గాంధీ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ పేర్కొంది. లోక్‌సభ స్పీకర్ ఆదేశాలతోనే రాహుల్ ప్రసంగంలో కొన్ని కామెంట్లు తొలగించామన్నారు. హిందూమతాన్ని ఉద్దేశించి రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్లయతో పాటు బీజేపీ, ఆర్ఎస్ఎస్, మోదీ, అగ్నివీర్, నీట్ పరీక్షల్లో అక్రమాలపై రాహుల్ చేసిన కొన్ని వ్యాఖ్యలను తొలగిస్తున్నట్లు లోక్‌సభ సచివాలయం తెలిపింది. జై సంవిధాన్ అంటూ చర్చను ప్రారంభించిన రాహుల్ గాంధీ గంట 40 నిమిషాల పాటు లోక్‌సభలో ప్రసంగించారు. ప్రతిపక్ష నేత ప్రసంగంపై పదేపదే పలువురు కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్థధాని మోదీ కూడా రెండు సార్లు జోక్యం చేసుకుని రాహుల్ వ్యాఖ్యలను ఖండించారు. తాను ప్రసంగిస్తున్న వేళ రాహుల్ సభలో కొన్ని మతపరమైన ఫొటోలను రాహుల్ చూపించారు. దీనిపై అధికారపక్షం నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమైంది. సభలో ఇలాంటి మతపరమైన ఫొటోల ప్రదర్శనకు నిబంధనలు అంగీకరించవని స్పీకర్ ఓం బిర్లా సూచించారు. చివరకు బీజేపీ ఎంపీల ఫిర్యాదుతో స్పీకర్ రాహుల్ ప్రసంగంలో కొన్ని వ్యాఖ్యలు తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# మరోమారు లైఫ్ ట్యాక్స్ అంటే ఎలా?

## లోకేశ్‌కు మొర పెట్టుకున్న క్యాబ్ డ్రైవర్స్

అమరావతి,జూలై2( ప్రజా మంటలు):

మరోమారు లైఫ్ ట్యాక్స్ కట్టాలంటూ తెలంగాణ అధికారులు చెబుతున్నారని ఎపి క్యాబ్ డ్రైవర్స్ వాపోయారు. ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్‌ను హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ క్యాబ్ డ్రైవర్లు కలిశారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనలపై వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో తమ వాహనాలకు మళ్లీ లైఫ్ ట్యాక్స్ చెల్లించాలని అక్కడి అధికారులు చెబుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇప్పటికే వాహనాలకు లైఫ్ ట్యాక్స్ కట్టామన్నారు. మరోసారి లైఫ్ ట్యాక్స్ కట్టడం వల్ల ఆర్థికంగా తీవ్ర నష్టపోతామని విన్నవించారు. హైదరాబాద్‌లో ఏపీ వాహనాలపై అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 6న జరగనున్న ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి భేటీలో తమ సమస్యకు పరిష్కారం లభించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో తమ వాహనాలకు మరికొంతకాలం వెసులుబాటు కల్పించాలని కోరారు. ప్రజాదర్బార్‌లో లోకేశ్‌ను ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. కోడ్ వల్ల నిలిచిన బదిలీ ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో ఉపాధ్యాయ బదిలీల్లో భారీ అవినీతి జరిగింది. నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ బదిలీలు చేపడతాం. ఉపాధ్యాయ బదిలీల అంశంలో తాను చెడ్డ పేరు తెచ్చుకోదల్చుకోలేదని టీచర్లతో లోకేశ్ వ్యాఖ్యానించారు.

# నియోజకవర్గ అభివృద్ధికి ప్రతీనెలా సమీక్ష

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


గుంటూరు,జూలై2 (ప్రజా మంటలు):

ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతీనెల సమీక్షించి ప్రాధాన్యతల వారీగా లక్ష్యాలు నిర్ణయిస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ...నెల రోజులలోపు నియోజకవర్గంలో చేపట్టాలనుకున్న పనులను గుర్తించామని.. సాగు నీటి కాలువల్లో పూడికతీత పనులు చెయ్యాలని నిర్ణయించామన్నారు. కాల్వల్లో గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోయి ఉందన్నారు. గత ఐదేళ్ళలో ప్రభుత్వం కాల్వల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. పూడిక తీత పనులకు గాను మొదటి క్యాబినెట్‌లోనే సీఎం ఆమోదించారని తెలిపారు.గతంలో పెద్ద కాంట్రాక్టులు వచ్చి పనులు చేయకుండా చేశామని బిల్లులు తీసుకునేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. రోడ్లపై గుంతలను తాత్కాలంగా పూడ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు కూడా నిధులు బ్జడెట్ లో పెట్టాలని అడిగామన్నారు. ఛానల్‌ను పర్చూరు వరకు పొడగించాలంటే మొదటి నుంచి కాలువను వెడల్పు చేయాల్సి ఉందన్నారు. ఛానల్ పొడగింపునకు ఇప్పటికే ప్రతిపాదనలున్నాయని.. వాటి మేరకు బ్జడెట్‌లో నిధులు మంజూరుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు.

# 4న సింగూరు జలాలు బంద్

## తాగునీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్ (ప్రజా మంటలు):



హైదరాబాద్ మహానగరానికి గురువారం సింగూరు జలాల సరఫరా బంద్ కానున్నది. నగరంలోని పలు ప్రాంతాలకు దాదాపు 24గంటల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుంది. నగరానికి తాగునీటిని సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజ్‌లకు విద్యుత్‌ను సరఫరా చేసే 132 కేవీ పెద్దాపూర్, కంది సబ్‌స్టేషన్లలో టీజీ ట్రాన్స్‌కో అధికారులు గురువారం ఉదయం ఏడు గంటల నుంచి శుక్రవారం ఉదయం ఏడు గంటల వరకు మరమ్మతు చేయనున్నారు. దీంతో షేక్‌పేట్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ, మూసాపేట్, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, హఫీజ్‌పేట్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల ప్రాంతాలకు దాదాపు 24 గంటలపాటు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోనుంది. భోజగుట్ట రిజర్వాయర్, బంజారా, ఎర్రగడ్డ, కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్, తెల్లాపూర్, ఓ అండ్ ఎం డివిజన్-8లోని బల్క్ కనెక్షన్లకు పాక్షికంగా నీటి సరఫరాలో అంతరాయం తలెత్తనుంది.

# ఇది నడిచే ప్రభుత్వం కాదు..పడిపోయే ప్రభుత్వం


### 400 సీట్లు అన్నారు..ఫెయిల్ అయ్యారు

### న్యాయంగా అయితే మేమే విజయం సాధించాం

### ఇవిఎంలను నమ్మే పరిస్థితి లేదన్న అఖిలేశ్ యాదవ్

న్యూఢిల్లీ,జూలై2(ప్రజా మంటలు):

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరుగుతోన్న చర్చలో విపక్ష నేతలు మోదీ సర్కార్‌పై విరుచుకుపడుతున్నారు. తాజాగా ఎస్పీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ పేపర్ లీక్, ఈవీఎంలు, అయోధ్య ఎన్నికల ఫలితాలు, ఉత్తర్‌ప్రదేశ్‌లో అవినీతి గురించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో 400 సీట్లు అంటూ వారు ప్రచారం చేశారు. కానీ ప్రజలు మాకు నైతిక విజయం కట్టబెట్టారు. ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువకాలం ఉండదని అంతా చెప్తున్నారు. వ్యక్తిగత లక్ష్యాల ఆధారంగా దేశాన్ని నడిపించలేరు' అని భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగుతోన్న అవినీతి గురించి మాట్లాడుతూ.. అభివృద్ధి పేరిట దోపిడీ జరుగుతోందన్నారు. ఒకప్పుడు తాము నిర్మించిన రోడ్లపై విమానాలు దిగాయని, కానీ ఇప్పుడు ప్రధాన నగరంలో పడవలు తిరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇదేం స్మార్ట్ సిటీనో అంటూ ప్రభుత్వ పథకాలపై విమర్శలు గుప్పించారు. నీట్ అవకతవకలపై మాట్లాడుతూ.. అసలు పేపర్ లీక్‌లు ఎందుకు జరుగుతున్నాయి? యువతకు ఉద్యోగాలు ఇవ్వొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వమే ఇలాంటి చర్యలకు ఒడిగడుతోందని మండిపడ్డారు. ఈవీఎంలపై నాకు ఎప్పుడూ నమ్మకం లేదు. మాకు 80కి80 సీట్లు వచ్చినా ఆ నమ్మకం కుదరదు. ఈవీఎంల సమస్య ఇంకా అలాగే ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. అయోధ్యలో భాజపా ఓటమి.. పరిణితి సాధించిన ఓటరు విజయమని వ్యాఖ్యానించారు. కులగణనకు మేం అనుకూలం. అలాగే అగ్నివీర్ స్కీమ్‌ను మేం ఎప్పటికీ అంగీకరించం. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. దానిని రద్దు చేస్తాం. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేదు. ఉద్యానవన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అయోధ్యలో అసత్యంపై సత్యం గెలిచిందన్నారులోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే నైతిక విజయమన్నారు. బీజేపీ నాలుగు వందల సీట్లు ఫెయిల్ అయ్యాయి. ఎన్డీఏ నడిచే సర్కార్ కాదు



పడిపోయే సర్కార్ అని విమర్శించారు.గంగానదిని శుభ్రం చేయనందుకే యూపీ ప్రజలు తగిన బుద్ధి బీజేపీకి చెప్పారన్నారు. యూపీలోని నగరాలన్నీ వర్షాలకు చెరువులయ్యాయని చెప్పారు. రామమందిరంపై రాజకీయాలు చేసి బీజేపీ ఓడిపోయిందని తెలిపారు. దేశంలో పంటలకు మద్దతు ధర దక్కడం లేదని రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇవ్వదల్చుకోలేదని అందుకే పేపర్ లీకులు చేస్తూ కాలం గడుపుతున్నారని చెప్పారు. యూపీలోని 80 సీట్ల ఈవీఎంలపై తనకు నమ్మకం లేదని అఖిలేష్ యాదవ్ అన్నారు.



# ఎబివిపి సర్వీస్ కమిషన్ కార్యాలయం ముట్టడి

## టీజీపీఎస్సీ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి

## విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
టీజీపీఎస్సీ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. టీచర్ పోస్టుల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ నిర్వహించాన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కి 1:100 పిలువాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల సంఖ్య పెంచే వరకు ఉద్యమిస్తామని ఏబీవీపీ కార్యదర్శి ఝాన్సీ స్పష్టం చేశారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రూప్-2, 3తోపాటు ఉపాధ్యాయ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయని చెప్పారు.ఏబీవీపీ ముట్టడి నేపథ్యంలో టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున పోలీసులు మోహరించారు. రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈక్రమంలో పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఒక్కొక్కరిగా అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని ఏబీవీపీ విద్యార్థులు ముట్టడికి యత్నించడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం టీఎస్పీఎస్సీ కార్యాలయానికి ముట్టడించేందుకు ఏబీవీపీ యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు వచ్చిన వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తోంది. అలాగే గ్రూప్ 2 పోస్టులు పెంచి నోటిఫికేషన్లు ఇవ్వాలని విద్యార్థులు పట్టుబడుతున్నారు. తక్షణమే మెగా డీఎస్సీ విడుదల చేయాలంటూ నినాదాలు చేసారు. ఉపాధ్యాయ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏబీవీపీ ముట్టడి నేపథ్యంలో టీఎస్పీఎస్సీ కార్యాలయానికి పోలీసులు భారీగా చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వారిని ఖాకీలు అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఏబీవీపీ విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుంటే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో గత తొమ్మిదిరోజులుగా గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్‌నాయక్ దీక్ష విరమించారు.నిరుద్యోగుల డిమాండ్ల కోసం గత తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నానని మోతీలాల్ నాయక్ చెప్పారు. కేసీఆర్ 9 రోజులు దీక్ష చేస్తే రాష్ట్రం వచ్చింది కానీ.. తాను దీక్ష చేస్తే ఒక్క ఉద్యోగం కూడా పెరుగలేద న్నారు. ఇతవరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఇన్నిరోజులు అన్నపానియాలు లేకుండా ఆమరణ దీక్ష చేశా. తన ఆరోగ్యం సరిగ్గా లేదని, క్రియాటిన్ లెవల్స్ పెరిగి కిడ్నీ, లివర్లు పాడయ్యే పరిస్థితికి వచ్చింది. తెలంగాణ వచ్చిన తర్వాత నీళు ,, కరెంటు వచ్చినయ్. 25 నుంచి 35 ఏండ్ల వయస్సు యువత ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం రాగానే తమ డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పారు. కానీ ఆ దిశగా అడుగులు మాత్రం పడలే. ఈ ప్రభుత్వానికి రాజకీయాలపై ఉన్న దృష్టి విద్యార్థులు, నిరుద్యోగులపై లేదు. ఉస్మానియా యూనివర్సిటీలో దీక్ష చేస్తానంటే సర్కారు ఒప్పుకోలేదు. మనుషులు చచ్చిపోయినా పట్టించుకోకపోవడం ప్రజాపాలనా?. నా ఫోన్ లాక్కుని ఎవరితోనూ మాట్లాడనీయడం లేదు. డీఎస్సీ రద్దు చేసి.. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలి. రేపటి నుంచి మా సత్తా ఏంటో చూపిస్తాం. 50 వేల ఉద్యోగాలు ఇచ్చే వరకు ఉద్యమాన్ని తీవ్రం చేస్తాం. ప్రభుత్వం జీవోలను విడుదల చేసే వరకు ఉద్యమిస్తామని
చెప్పారు.

# చంద్రబాబు లేఖను స్వాగతించిన హరీష్ రావు

## విలీనం అయిన ఏడు మండలాలే తొలి ఎజెండా కావాలి

## ఆ తరవాతే మిగిలిన అంశాలు చర్చించాలని డిమాండ్

హైదరాబాద్, (ప్రజా మంటలు):




ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర విభజన సమస్యలపై చర్చించడానికి లేఖ రాయడం సంతోషకర పరిణామమని ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్ట్‌ను ఏపీలో కలిపారన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఏడు మండలాలను ఏపీకి అప్పగించారన్నారు. దీనిపై రేవంత్ రెడ్డి చొరవ చూపాలని చంద్రబాబు అన్నారు. ఏడు మండలాలను తిరిగి తెలంగాణకు రప్పించడానికి ప్రయత్నం చేయాలన్నారు. దీన్నే మొదటి ఎజెండాగా పెట్టాలన్నారు. ఏడు మండలాలు ఇచ్చిన తర్వాతనే మిగిలిన అంశాలపై ముందుకు వెళ్లాలని హరీష్ రావు అన్నారు. చంద్రబాబు అత్యంత శక్తి వంతుడని.. బీజేపీ, కేంద్ర ప్రభుత్వం ఆయన చేతిలోనే ఉన్నాయని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వం రెండు నెలల పెన్షన్ బకాయి పడిందన్నారు. పక్క రాష్ట్రంలో చంద్రబాబు పెన్షన్ పెంచితే.. మన సీఎం మాత్రం రెండు నెలలు బకాయి పడ్డారన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ప్రభాకర్ అనే ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నారని.. ఆయన ఆత్మహత్య చాలా హృదయ విదారకంగా ఉందన్నారు. రాష్ట్రంలో పరిస్థితికి ప్రభాకర్ ఆత్మహత్య నిదర్శనమన్నారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కూడా పోలీసులు పట్టించుకోవడం లేదని హరీష్ రావు అన్నారు. ఎమ్మార్వో, కలెక్టర్, ఎస్ఐ ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఏ ఒక్కరు పట్టించుకున్నా ప్రభాకర్ ప్రాణాలు దక్కేవన్నారు. బాద్యుల పై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని.. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని హరీష్ రావు అన్నారు.

# సబితా ఇంద్రారెడ్డిని కాంగ్రెస్‌లోకి రానీయం

## కొత్తపేట చౌరస్తాలో సబిత దిష్టిబొమ్మ దగ్ధం

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తన స్వార్థం కోసం తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి సీఎల్పీని టీఆర్ఎస్‌లో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే సబితారెడ్డి అధికార దాహంతో తిరిగి కాంగ్రెస్‌లోకి రావడానికి ప్రయత్నించడం సహించరానిదని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సబితారెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్న సమాచారంతో ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పార్టీ ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలో సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 2018 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై గెలిచిన 12మంది ఎమ్మెల్యేలు పార్టీ పిరాయించడానికి ముఖ్య పాత్ర పోషించిన సబితారెడ్డి తన రాజకీయ స్వార్థం, అధికార దాహంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని దుయ్యబట్టారు.

# బంగారం, నగదు ఉన్న బ్యాగ్ చోరీ

భీమవరం,జూలై2 (ప్రజా మంటలు):
పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో భారీ దొంగతనం జరిగింది. ఆర్టీసీ బస్టాండ్‌లోరూ. 11 లక్షల నగదు, 4 వందల గ్రాముల బంగారం బ్యాగ్ చోరీకి గురైంది. గుంటూరుకు చెందిన ఓ వ్యాపారి నరసాపురం నుంచి నగదు బంగారం తీసుకువెళు తుండగా ఈ ఘటన జరిగింది. భీమవరం వెళ్లే బస్సు రద్దీగా ఉండడంతో తన బ్యాగ్‌ను బస్సు కిటికీలోంచి బస్సులో వేశాడు. అయితే బస్సు ఎక్కి చూసుకునేసరికి బ్యాగ్ కనిపించలేదు. దీంతో బాధితుడు ఆందోళన చెందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# మరోసారి టెట్ నిర్వహణకు నోటిఫికేషన్

అమరావతి,జూలై2(ప్రజా మంటలు):
ఎపి రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. మెగా డీఎస్సీ నిర్వహించే ముందే మరోసారి టెట్ నిర్వహణకు ఎపి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జూలై 2 నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఎపిలో 16 వేలకు పైగా టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డిఎస్‌సి నిర్వహించనున్న సమయంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కు నోటిఫికేషన్ విడుదలైంది. ఆగస్టు 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్షలు జరగనున్నాయి. ఆగస్టు 25న తుది కీ విడుదల చేసి.. 30న టెట్ ఫలితాలను ప్రకటిస్తారు. ఆన్‌లైన్ విధానంలో జరగనున్న ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను ఇ‌బ।.జూ.ఐనీల.తిని వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. మరోవైపు ? మెగా డిఎస్‌సికి వచ్చే వారం ప్రత్యేక ప్రకటన విడుదల చేయనున్నారు. డిఎస్‌సిలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉన్న సంగతి తెలిసిందే. నోటిఫికేషన్, ఇన్‌ఫర్మేషన్ బులిటెన్, షెడ్యూల్, సిలబస్‌తోపాటు ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షపై అభ్యర్థులకు తగిన సూచనలు, విధివిధానాలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు.

# అక్రమ మైనింగ్ వ్యవహారం

## ఇడి ముందు హాజరయిన ఎమ్మెల్యే మహిపాల్

హైదరాబాద్,జూలై2 (ప్రజా మంటలు):
బీఆర్ఎస్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మంగళవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. మైనింగ్ తవ్వకాల్లో అక్రమాలు పాల్పడ్డారంటూ ఎమ్మెల్యేపై ఈడీ కేసు నమోదు చేసింది. అలాగే మైపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి ఇళ్లలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు మహిపాల్ ఇంట్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. దాదాపు రూ.300 కోట్ల రూపాయల వరకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లే విధంగా చేశారని ఆరోపించారు.వారం రోజుల క్రితం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో పాటు సోదరుడి ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించింది. మైనింగ్ తవ్వకాల్లో ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించకుండా ఎగ్గొట్టారని ఆరోపణలు వచ్చాయి. సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్ పేరుతో మహిపాల్ రెడ్డి వ్యాపారం నిర్వహిస్తున్నారు. దాదాపు రూ.39 కోట్ల రూపాయల వరకు టాక్స్ ఎగ్గొట్టారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. మైనింగ్‌లో వచ్చిన లాభాలన్నీ రియల్ ఎస్టేట్‌తో పాటు బినామీ పేర్లతో వ్యాపారాలు కొనసాగించినట్లు తెలుస్తోంది. సంగారెడ్డి పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో మహిపాల్ సోదరులు మైనింగ్ నిర్వహించినట్లు సమాచారం.

# అమెరికాలో ఎన్నారై వ్యాపరవేత్తల స్కామ్

## జైలు శిక్షలు విధించిన స్థానిక కోర్టు

న్యూయార్క్,జూలై2(ప్రజా మంటలు):
అమెరికాలో భారత సంతతి వ్యాపారవేత్తలు బిలియన్ డాలర్ల స్కామ్‌కు పాల్పడినట్లు తేలడంతో జైలు శిక్ష విధించారు. ఒకప్పుడు చికాగోలోనే అత్యంత వేగంగా ఎదిగిన స్టార్టప్ మోసాలకు పాల్పడినట్లు ఈసందర్భంగా న్యాయస్థానం పేర్కొంది. ఔట్‌కమ్ హెల్త్ పేరిట రిషి షా, శ్రద్ధా అగర్వాల్‌లు ఓ హెల్త్ మీడియా సంస్థను 2006లో ఏర్పాటుచేశారు. ఈ కంపెనీ డాక్టర్ల వద్ద స్క్రీన్‌లు, టాబ్లెట్లను ఏర్పాటు చేసింది. వీటిల్లో పేషెంట్లను టార్గెట్ చేసుకొని వివిధ కంపెనీల మెడికల్ అడ్వర్టైజింగ్ ప్రకటనలు ప్రసారం చేసేది. ఈ సృజనాత్మక ఆలోచనకు అమెరికాలో మంచి స్పందన లభించింది. దేశవ్యాప్తంగా కంపెనీకి కాంట్రాక్టులు లభించాయి. 2010లో ఆ దేశ టెక్, హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్లలో ఉన్నత స్థానానికి చేరింది. దీంతో భారీ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించింది. గోల్డ్‌మన్ సాక్స్, ఆల్ఫాబెట్, జేబీ ప్యాట్రిక్స్ వెంచర్ క్యాపిటల్స్ వంటి సంస్థలు భారీగా ఇన్వెస్ట్‌మెంట్లు చేశాయి. చికాగో కార్పొరేట్ సర్కిల్స్‌లో షా అప్పట్లో ఓ స్టార్ అయిపోయాడు. కానీ, రిషి, శ్రద్ధా, సీఎఫ్‌వో బ్రాడ్ పొర్డీలు కంపెనీ ఆపరేషనల్, ఫైనాన్షియల్ కార్యకలాపాలను పెంచి చూపిస్తున్నట్లు గుర్తించారు. కంపెనీ డెలివరీ చేయగలిగిన స్థాయి కంటే ఎక్కువగా వాణిజ్య ప్రకటనల ఇన్వెంటరీని విక్రయిస్తున్నట్లు తేలింది. ఫార్మా జెయింట్ నోవో నార్డిస్క్, మరికొన్ని కంపెనీలు ఈ అంశాన్ని గుర్తించాయి. మరోవైపు షా విలాసవంతమైన జీవనశైలి ఇన్వెస్టర్లలో అనుమానాలు పెంచింది. అతడు 10 మిలియన్ డాలర్లు వెచ్చించి ఇల్లు కొనుగోలు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై వాల్‌స్ట్రీట్ జర్నల్ 2017లో కథనం ప్రచురించింది. ఆ తర్వాత గోల్డ్‌మన్ సాక్స్, ఆల్ఫాబెట్ వంటి ఇన్వెస్టర్లు కోర్టులో కేసు ఫైల్ చేశారు. షాపై 2023 ఏప్రిల్‌లో డజను కౌంట్స్‌కుపైగా మనీ లాండరింగ్ కేసు నమోదైంది. మిగిలిన ఇద్దరిని కూడా దీనిలో భాగస్వాములను చేశారు. ఈ కేసు విచారణ జరిపిన న్యాయస్థానం జూన్ 26 నుంచి షాకు ఏడేళ్ల ఆరు నెలలు, జూన్ 30 నుంచి శ్రద్ధాకు మూడేళ్ల హాఫ్‌వే హౌస్‌లో ఉండేలా, పొర్డీకి రెండేళ్ల మూడు నెలల జైలు శిక్ష విధించింది. మరోవైపు తాను చేసిన పనికి సిగ్గుపడుతున్నట్లు షా తన నేరం అంగీకారంలో వెల్లడించాడు.



# గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

## ఆగిపోయిన పల్లె ప్రగతి పనులు

## గ్రామపంచాయతీలకు నిధులు నిల్

## వైరల్ ఫీవర్లు పంజా విసురుతున్న చలనం లేదు

## సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):



కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. గత ఏడు నెలల నుంచి గ్రామపంచాయతీలకు ఏడు పైసలు కూడా విడుదల చేయలేదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రాష్ట్రంలో గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్యం నిలిచిపోయింది. మలేరియా, డెంగ్యూ వంటి వైరల్ ఫీవర్స్‌తో ప్రజలు బాధపడుతున్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం గత సీఎం కేసీఆర్ పల్లె ప్రగతి తెచ్చి ప్లలెలను అద్దాల్లా మార్చారు. పట్టణ ప్రగతి ద్వారా పట్టణాల్లో అద్భుతమైన అభివృద్ధి సాధించారు. గ్రామాల్లో పరిశుభ్రత, స్వచ్ఛత లక్ష్యంగా బీఆర్ఎస్ అనేక కార్యక్రమాలు చేపట్టింది. వర్షాకాలం ప్రారంభమంలో స్పెషల్ డ్రైవ్, మార్చి నెలలో మరో డ్రైవ్ చేసేవాళ్లం. దాంతో వైరల్ ఫీవర్స్‌ను అరికట్టగలిగాం.. అభివృద్ధి కూడా జరిగింది అని హరీశ్‌రావు తెలిపారు. ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం పడకేసింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోతోంది. ఏడు నెలల కాలంలో ఏడు పైసలు కూడా విడుదల చేయలేదు. ఆ రోజు కేసీఆర్ ప్రభుత్వంలో ప్లలె ప్రగతి కింద ప్రతి ప్లలెకు జనాభా ప్రతిపాదన నిధులు ఇచ్చాం. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చాం. కాంగ్రెస్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్లలెలు దేశానికి ఆదర్శంగా నిలిచాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి నెలలు గడుస్తుంది. ఎన్నికలు పెట్టే పరిస్థితి లేదు. ఈ నెల 4న జిల్లాల పరిషత్‌ల పదవీకాలం ముగియనుంది. దానికి ఎన్నికలు పెట్టే ఆలోచనలో లేదు. గ్రామ పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసి పారిశుద్ధ నిర్వహణను మెరుగుపరచాలి అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని హరీశ్‌రావు మండిపడ్డారు. పరిశుభ్రంగా ఉంచాల్సిన పల్లెలను ఎందుకు గాలికి వదిలేశారు అని హరీశ్‌రావు నిలదీశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణ గ్రామపంచాయతీల్లో చెత్త సేకరణకు కేవలం 87 ట్రాక్టర్లు మాత్రమే ఉండేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 12,769 పంచాయతీల్లో 12,769 ట్రాక్టర్లను సమకూర్చి చరిత్ర సృష్టించింది. కేంద్రం గ్రామపంచాయతీలకు ఇచ్చే అవార్డుల్లో తెలంగాణ ప్లలెలు లేకుండా అవార్డులు లేవు. తెలంగాణ ప్లలెలు, మండలాలు,జిల్లాలు ఉత్తమంగా నిలిచాయి. కానీ కాంగ్రెస్ పాలనలో గ్రామపంచాయతీ లు కూనరిల్లుతున్నాయి. ప్లలెలు కన్నీరు పెట్టే పరిస్థితి ఉంది. మురికి కూపాలుగా మారుతున్నాయి. డీజిల్ పోయించుకునే పరిస్థితి లేదు. ట్రాక్టర్లు మూలకు పడ్డాయి. ఇది ఇవాళ పరిస్థితి. కొన్ని చోట్ల పంచాయతీ సెక్రటరీలు అప్పులు చేసి డిజీల్ పోయిస్తున్నారు. నా నియోజకవర్గానికి నిన్న వెళ్లాను.. స్పష్టంగా అధికారులతో మాట్లాడిన తర్వాతనే మాట్లాడుతున్నాను. కరెంట్ బిల్లులు కట్టేందుకు కూడా గ్రామపంచాయతీల వద్ద డబ్బుల్లేవు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ బిల్లులు సయమానికి కట్టేవారు. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు డబ్బులు, పారిశుధ్య కార్మికులు వేతనాలు ఇచ్చేవారు. ఇప్పుడు పాలనా అస్తవ్యస్తంగా తయారైంది అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంచాయతీల్లో డబ్బుల్లేక చెత్త పేరుకుపోయింది. స్పెషల్ డ్రైవ్ లేదు. ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. ప్రజా ప్రభుత్వంలో పారిశుద్ధ కార్మికులకు స్థానం లేదా..? ఒకటో తారీఖున జీతాలు ఇవ్వారా..? అంటురోగాల బారిన పడితే ఎలా..? ప్లలెల మీద సమీక్ష ఎందుకు చేయట్లేదు. చివరకు సర్పంచ్‌లు పోయి గవర్నర్‌కు మొర పెట్టుకునే పరిస్థితి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వంలో. వేతనాలు అందక కార్మికులు ధర్నాలు చేస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలి. బ్లీచింగ్ పౌడర్ నీళ్లల్లో కలపాలి. గడ్డి మందు లేదు. అస్తవ్యస్తం అయిపోయింది ప్రజా పాలన. ప్లలెలను ఎందుకు గాలికి వదిలేశారు అని హరీశ్‌రావు నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల ప్రగతికి నెలకు రూ. 275 కోట్లు, ఏడాదికి రూ. 3,330 కోట్లు ఖర్చు పెట్టామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఈ నిధులన్నింటిని పారిశుధ్య నిర్వహణకు ఖర్చు పెట్టినట్లు తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్న ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు కేటాయించ లేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. పట్టణాల్లో కూడా మున్సిపాలిటీలకు ఏడాదికి రూ. 1700 కోట్లు ఇచ్చాం. మీరు వచ్చి ఏడు నెలలు అయినా ఏడు పైసలు కూడా ఎందుకు ఇవ్వలేదు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయాలనుకుంటున్నారా..? మలేరియా, డెంగీ వంటి వైరల్ ఫివర్ నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు ఎందుకు..? బీఆర్ఎస్ హయాంలో ప్లలె ప్రగతి, పట్టణ ప్రగతికి గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేశాం. దాదాపు ఈ రెండింటికి గత ఐదేండ్లలో రూ. 20 వేల కోట్లు ఖర్చు పెట్టింది బీఆర్ఎస్. ఏడు నెలల కాలంలో 20 పైసలు కూడా ఖర్చు పెట్టలేదు కాంగ్రెస్ గవర్నమెంట్. ఇది బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా.. అని హరీశ్‌రావు తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు కూడా ఏడు నెలలుగా జీతాలు అందడం లేదు. తక్షణమే పారిశుధ్య కార్మికులతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీలకు జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంది కాంగ్రెస్ ప్రభుత్వం పోకడ. పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నారు. తమ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడా లేని విధంగా స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో అడడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ అనే ఒక కొత్త పోస్టును క్రియేట్ చేశారు. పారిశుధ్య నిర్వహణ, ప్లలెల అభివృద్ధి కోసం వారి సేవలను వినియోగించుకున్నాం. ఇప్పుడు ఆ వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా కళ్లు తెరవండి. పల్లెలను గాడిన పెట్టండి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com